# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :74 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 11-05-2024 | పేజీలు:4 వెల: 2.00


## ఎన్నికలపై మోదీ, రాహుల్ లైవ్ డిబేట్!

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే మూడు విడతలకు పోలింగ్ ప్రక్రియ ముగిసింది. మరో రెండ్రోజుల్లో నాలుగో విడత ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో దేశ రాజకీయం రంజుగా మారింది. ఈ క్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మధ్య బహిరంగ చర్చ జరగాలని సీనియర్ మాజీ ఎడిటర్ ఎన్.రామ్, సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ మదన్ లోకూర్, ఢిల్లీ హైకోర్టు మాజీ సీజే జస్టిస్ ఎ.పి.షా అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధాని మోదీ, రాహుల్‌కు వీరు లేఖ రాశారు.ఇలాంటి చర్చ, వాణిజ్య ప్రయోజనాలకు దూరంగా, పక్షపాత రహితమైన వేదిక మీద జరగాలని వీరంతా లేఖలో కోరారు. ఇలాంటి అగ్ర నాయకుల మధ్య డిబేట్, ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా ఆరోగ్యకరమైన, శక్తిమంతమైన ప్రజాస్వామ్య వాస్తవ చిత్రాన్ని ఆవిష్కరిస్తుందని అభిప్రాయపడ్డారు. ఒకవేళ ఈ ఇద్దరు నేతలకు బహిరంగ చర్చలో పాల్గొనేందుకు వీలుకాకపోతే తమ తరఫున ప్రతినిధులను పంపాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఈ విషయం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది.

## ఈ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలదే హవా... కేసీఆర్



హైదరాబాద్ :ఈ లోక్ సభ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలే బలమైన పక్షంగా నిలబోతున్నాయని విశ్వాసం వ్యక్తం చేశారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. అధిక స్థానాలు కైవసం చేసుకునేది ప్రాంతీయ పార్టీలేనని, అందులో ఎటువంటి సందేహం లేదన్నారు.. జాతీయ మీడియాకు ఇవాళ ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ%౯%. ఇండియా, ఎన్డీయే ఈ రెండు కూటములను ప్రజలు నమ్మడం లేదని, ఈ రెండు కూటములు ఈ ఎన్నికల్లో దెబ్బతింటాయనే అభిప్రాయం వ్యక్తం చేశారు.. లిక్కర్ స్కామ్ పై మాట్లాడుతూ.. ఈ స్కామ్ సృష్టి కర్త మోదీనే అంటూ ఆరోపించారు.. ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో ప్రధాని క్రూరమైన ఆట ఆడుతున్నారని, ఇందులో ఎటువంటి స్కామ్ లేదని అన్నారు.ఈ కేసులో కవిత, అరవింద్ కేజ్రీవాల్ అమాయకులు అని, ఇది కేవలం పొలిటికల్ గేమ్ అని కొట్టిపారేశారు. రాష్ట్రం రూపొందించుకున్న లిక్కర్ పాలసీని స్కామ్ అని ఏ ఫూల్ అంటారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ దేశంలోని ప్రతి రాష్ట్రానికి ప్రత్యేకమైన లిక్కర్ పాలసీలు ఉన్నాయని గుర్తు చేశారు. ఈ కేసులో నయా పైసా రికవరీ చేయలేదని ధ్వజమెత్తారు. ఈడీ, సీబీఐలు బీజేపీకి అనుబంధ సంస్థలుగా పని చేస్తున్నాయని ఆరోపించారు. తమకు కోర్టులపై నమ్మకం ఉందని కచ్చితంగా తమకు న్యాయం జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. అటు కేజ్రీవాల్, ఇటు కవితలు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని అన్నారు..బీజేపీతో బీఆర్ఎస్ సీక్రెట్ గా ఒప్పందం కుదుర్చుకున్నాయని, ప్రతి సందర్భంలో బీజేపీకి బీఆర్ఎస్ మద్దతుగా నిలిచిందని ప్రత్యర్థులు చేస్తున్న ప్రచారంపై కేసీఆర్ స్పందిస్తూ, బీజేపీకి బీఆర్ఎస్ పూర్తి స్థాయిలో ఎప్పుడూ అండగా లేదన్నారు. తెలంగాణ ఏర్పడిన తొలినాళ్ళలో కేంద్రంతో రాజ్యాంగపరమైన సత్సంబంధాలు కొనసాగించామన్నారు. రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ కోరితేనే తాము మద్దతు ఇచ్చామని అదే సమయంలో రైతు చట్టాలను బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ విజయం పాలపొంగులాంటిదని వ్యాఖ్యానించారు.. తమ కంటే ఎక్కువ నిధులు ఇస్తానంటే ఆశపడి తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ను గెలిపించారని అన్నారు అయిదు నెలలోనే కాంగ్రెస్ చేసిన మోసం ప్రజలు అర్థం చేసుకున్నారని, ఈ ఎన్నికలలో ఆ పార్టీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు రాజకీయాలలో గెలుపు ఓటములు సహజమని, తాము తిరిగి పుంజుకుని అధికారంలో వస్తామని కెసిఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు.

## కల్యాణ లక్ష్మి చెక్కు బౌన్స్ అయింది..



హుస్నాబాద్: కాంగ్రెస్ నేతలు అన్నివర్గాల ప్రజలను మోసం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు (హరీష్‌రావు) అన్నారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తున్నారని, 5 నెలలవుతున్నా దిక్కు లేదని. ప్రస్తుత ప్రభుత్వం రివర్స్ గేర్‌లో నడుస్తున్నదని ఎద్దేవా చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్‌కు మద్దతుగా ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ నిరంతరం ఉండేదని, ఇప్పుడు నిత్యం సరఫరా నిలిచిపోతుందన్నారు. , నిరుద్యోగులను ఈ ప్రభుత్వం మోసం చేసిందని రైతులను.కల్యాణ లక్ష్మి చెక్కు బౌన్స్ అయింది.. తులంగారం తుస్సుమన్నదని చెప్పారు. పెండ్లి చేసుకున్న వాళ్లకు తులం బంగారం ఇస్తామన్న హామీ అమలు కాబడుతుంది. పైగా కాంగ్రెస్ వచ్చాక బంగారం ధరలు కొండెక్కాయని, కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ నిలిచిపోయిందని చెప్పారు. కేసీఆర్ తెలియజేశారు. ప్రియాంక గాంధీ గతంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి హుస్నాబాద్‌కు వచ్చినప్పుడు తాము గెలిస్తే ఇక్కడ మెడికల్ కాలేజీ ఇస్తామని చెప్పారు. ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు. మహిళల ఖాతాల్లో రూ.2500 జమ చేశామని రాహుల్ గాంధీ చెప్పారని, ఆయన అబద్ధాల గాంధీగా మారారని చెప్పారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రూ.15 వేల రైతుబంధు, ధాన్యానికి రూ.500 బోనస్ రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్ సరూర్‌నగర్‌లో నిర్వహించిన రాహుల్ గాంధీ మీటింగ్ తుస్ మన్నది. 30 వేల కుర్చీలు వేసి కూలర్లు పెడితే పట్టుమని 3 వేల మంది కూడా రాలేదని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి రోడ్డు మీదకి పోయి లోపలకు రండని బ్రతిమిలాడిన ఎవరూ వస్తారని చెప్పారు.

## కేటీఆర్ పై టమాటాల దాడి.. 23మందిపై కేసు నమోదు..



హైదరాబాద్,నిర్మల్ జిల్లా భైంసాలో నిన్న కేటీఆర్ రోడ్ షో లో కేటీఆర్ పై టమాటాల దాడి కేసులో 23 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అందులో 17 మంది హనుమాన్ దీక్ష పరులు ఉండటం గమనార్హం. 23 మందిపై 307,120 B, 143 ,144,147, 148R/W 149 IPC సెక్షన్ ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. కాగా.. నిన్న నిర్మల్ జిల్లాలోని భైంసా పట్టణంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో, కార్నర్ మీటింగ్ నిర్వహించిన విషయం తెలిసిందే.ఈ సందర్భంగా కార్నర్ మీటింగ్ కు ముందే హనుమాన్ దీక్షాపరులు, పోలీసులకు మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. గతంలో కేటీఆర్ జై శ్రీరామ్ అనే మాట అన్నం పెడుతుందా..!

అని అన్న వ్యాఖ్యలకు నిరసనగా హనుమాన్ మాలధారులు జై శ్రీరాం నినాదాలు చేస్తూ కేటీఆర్ రాకకు నిరసన తెలిపారు. కొద్దిసేపు పోలీసులకు, స్వాములకు మధ్య తోపులాట జరిగింది. సభ స్థలం వద్దకు రాకుండా హనుమాన్ దీక్ష స్వాములను తాళ్లతో బారికేడ్లతో నిర్బంధించారు. కార్నర్ మీటింగ్ లో కేటీఆర్ ప్రసంగిస్తూ జై తెలంగాణ అంటూ నినాదాలు ఇచ్చే సమయాన అవతల వైపు నుండి స్వాములు జైశ్రీరామ్ అంటూ నినాదాలు ఇవ్వగా ఘర్షణ వాతావరణం నెలకొంది.కార్నర్ మీటింగ్ లో మాట్లాడుతున్న కేటీఆర్ పై కొందరు టమాటాలు, ఉల్లిగడ్డలు, వంకాయలతో దాడి చేశారు. మీటింగ్ లో ఉన్న పక్క వారిపై అవి పడడడంతో రాముడు ఇలానే ఇతరులపై దాడి చేయమన్నాడా అంటూ కేటీఆర్ ప్రశ్నించాడు. భారీ బందోబస్తుతో పోలీసులు స్వాములను, బీఆర్ఎస్ కార్యకర్తలను చెదరగొట్టారు. ప్రసంగం ముగిసిన వెంటనే కేటీఆర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

## అధికార పార్టీకి కొమ్ముకాస్తున్న ఇసి




న్యూఢిల్లీ,మే10: ప్రధాని తన ఎన్నికల ప్రసంగాలలో అనేక సార్లు ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారన్న ఆరోపణలపై ఎన్నికల సంఘం ఎలాంటి చర్య తీసుకోవడంలేదు. హోంమంత్రి, ప్రధానుల విషయంలో ఓ రకంగానూ ఇతరుల విషయంలో మరో రకంగానూ వ్యవహరిస్తోందని ఇటీవల ఆరోపణలు వెల్లువెత్తాయి. కెసిఆర్ ప్రసంగాలపై చర్యలు తీసుకున్న ఇసి 48 గంటలపాటు ప్రచారంలో పాల్గొనకుండా ఇటీవల ఆంక్షలు విధించింది. ఇది స్వాగతించాల్సిందే. అయితే అన్ని పక్షాలకు ఇలాగే జరగాలి. ఇక్కడ అధికార, విపక్షం అన్న తేడా కనిపించరాదు. గతంలో పలు సందర్భాల్లో విపక్షాలు వీటిని ప్రస్తావించాయి. ఈ విషయంపై అనేక మంది ఫిర్యాదు చేసినా, కమిషన్ వీటిని ఏ మాత్రం పట్టించుకోలేదు, చర్య తీసుకోలేదు. నేతల ఎన్నికల ప్రచారం,విద్వేష ప్రసంగాలపై కట్టడి ఉండాలి. ఈ క్రమంలో గతంలో సుప్రీంకోర్టు ఎన్నికల కమిషన్‌ను నిలదీయటంతో ఆదిత్యనాథ్, మాయావతి, ఆజంఖాన్, మేనకా గాంధీ వంటి నేతలను రెండు లేదా మూడు రోజుల పాటు ప్రచార పక్రియ నుండి నిషేధించింది. అయితే ప్రధాని నరేంద్ర మోడీపై ఎటువంటి చర్యా తీసుకోలేదు. కమలం గుర్తున్న మీట నొక్కితే అది సైనికుల్ని నిద్ర లేపుతుందని కూడా గతంలో ఓ మారు ప్రధాని మోడీ చెప్పడం కోడ్ ఉల్లంఘనగానే పరిగణించాలి. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రధాని పదేపదే ఉల్లంఘించటంపై కమిషన్ నిర్లిప్తతను నిలదీస్తూ కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన సుప్రీంకోర్టు వివరణ ఇవ్వాలని ఆదేశించినా అప్పట్లో ఇసి పెద్దగా స్పందించ లేదు. పైగా ప్రధాని తన ప్రసంగంలో ఎక్కడా ఎన్నికల ప్రవర్తనా నియమావళి, లేదా ప్రజా ప్రాతినిధ్య చట్ట ఉల్లంఘన జరగలేదని ప్రకటించింది. ఎన్నికల ప్రచారంలో సైనిక దళాల ప్రస్తావన తీసుకు రావద్దని రాజకీయ పార్టీలకు ఇ.సి ఆదేశాలు జారీ చేసినప్పటికీ, మోడీ తన ఎన్నికల ప్రచార సభల్లో ఇందుకు విరుద్ధంగా సైనిక దళాలను ప్రస్తావిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్న ఫిర్యాదులపై స్పందించేందుకు కమిషన్ ఏకపక్షంగా నిరాకరిస్తూ వస్తోంది. ఇప్పటి వరకూ మూడు దశల ఎన్నికలు పూర్తయ్యాయి. నాలుగోదశ సోమవారం జరుగబోతోంది. తనకు అందిన ఫిర్యాదులపై ఎటువంటి చర్యా తీసుకోకుండా ఎన్నికల కమిషన్ మోడీకి స్వేచ్ఛ కల్పించింది. కేంద్రం లోనూ, వివిధ రాష్ట్రాల్లోనూ అధికారంలో వున్న బిజెపి తప్పులపై ఇ.సి నిర్లిప్త ధోరణితో వ్యవహరిస్తోందని విపక్షాలు విమర్శిస్తున్నాయి. భారత ప్రజాస్వామ్య ఎన్నికల సంఘం ప్రధాని నరేంద్ర మోడీకి, అధికార పార్టీకి కొమ్ముకాస్తోందన్న విమర్శలపై ఎలాంటి స్పందనా లేదు. మోడీ, అమిత్‌షా ద్వయం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని బాహాటంగా ఉల్లంఘిస్తున్నారని ప్రతిపక్షాలు, మీడియా, ప్రజలు కోడై కూస్తున్నా, ఎన్నికల కమిషన్‌కు చీమ కుట్టినట్టు కూడా లేదు. రాజ్యాంగం ద్వారా తనకు సంక్రమించిన అధికారాలను ఉపయోగించుకుని రాజకీయ పార్టీలను, అభ్యర్థులను హద్దు మీరకుండా కట్టడి చేయాల్సిన ఇసి అధికారంలో ఉన్న వారి ఒత్తిళ్లకు తలొగ్గి పక్షపాతంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తున్నది. ఎన్నికల ప్రచారంలో అన్ని పార్టీలకు, అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పించడంలో ఎన్నికల కమిషన్ ఘోరంగా విఫలమైంది. ప్రధాని మోడీకి ఒక నీతి, ఇతరులకు మరో నీతి అన్నట్టుగా వ్యవహరిస్తున్నదని ప్రదాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఆరోపిస్తోంది. భారత్ వంటి అతిపెద్ద దేశంలో అంపైర్ పాత్ర పోషించాల్సిన ఎన్నికల సంఘమే ఉద్దేశపూర్వకంగా పక్షపాతంతో వ్యవహరిస్తున్నదని విపక్షాలు పదేపదే ఆరోనిస్తున్నాయి. మోడీ, షాల ప్రచారం ఎక్కువ స్థానాల్లో జరుపు కోవడానికి వీలు కల్పించడానికే అసాధారణ రీతిలో దాదాపు రెండు నెలల పాటు ఎన్నికల షెడ్యూల్‌ను సాగదీశారన్న విమర్శలకూ సమాధానం లేదు. ప్రతిపక్షాలు ఫిర్యాదు చేస్తే వారాల తరబడి నాన్చి, చివరికి కోడ్ ఉల్లంఘన ఏమీ జరగలేదంటూ తేల్చేస్తుందని ఆరోపిస్తున్నాయి. ప్రతిపక్షాలు ఆధారాలతో సహా ఆరు ఫిర్యాదులు చేస్తే, ఏ ఒక్క కేసులోనూ చర్య తీసుకోలేదు. ఎన్నికల కోడ్ పేరుతో మన రాష్ట్రంలో ఎన్నికల సంఘం అతిగా వ్యవహరించడం వల్ల గత నెల రోజులుగా పాలన ఎలా పడకెక్కినదీ చూస్తున్నాము.

## కాంగ్రెస్‌కు భయపడుతున్నందునే బీజేపీ పదే పదే ఆరోపణలు



హైదరాబాద్ : ఈ దేశంలో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ప్రజాదారణను చూసి భారతీయ జనతా పార్టీ పదేపదే ఆరోపణలు చేస్తుందని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణా హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఖర్గే మీడియాతో మాట్లాడారు.ఏదైతే చెబుతామో అది కచ్చితంగా చేసి చూపిస్తాం. రైతుబంధు నిధులు రైతుల ఖాతాల్లో జమ చేశాం. పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లిస్తాం. ఇచ్చిన హామీల మేరకు పథకాలు అమలు చేశాం అని ఖర్గే స్పష్టం చేశారు.అధిక విడతల్లో ఎన్నికల నిర్వహణ ఎవరకీ ఉపయోగం లేదు. ఎన్నికల కమిషన్ విధానాల మేరకు అందరూ నడుచుకోవాలి. చేసిన అభివృద్ధి గురించి చెప్పుకుని బీజేపీ ఓట్లు అడగదు. కాంగ్రెస్‌పై నిందలు మోపడం ద్వారా ఓట్లు అడుగుతారు. కాంగ్రెస్ తమకు పోటీయే కాదంటూ పదేపదే విమర్శలు చేస్తున్నారు. కాంగ్రెస్‌కు భయపడుతున్నందునే పదేపదే ఆరోపణలు చేస్తున్నారు అని ఖర్గే మండిపడ్డారు.నల్లధనం వెలికితీస్తామని ఎన్నో ప్రగల్భాలు పలికారు. నల్లధనం ప్రయోజనాలు తన మిత్రులకే అందజేశారు. ఎన్నికల ప్రకటన తర్వాత అదానీ, అంబానీ గురించే మాట్లాడలేదంటున్నారు. టెంపోల్లో కాంగ్రెస్ నేతలకు డబ్బులు ముడుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఎక్కడి నుంచి డబ్బులు ఎక్కడికి వెళ్తున్నాయో మీరు ఎప్పుడు చూశారు. టెంపోల్లో డబ్బులు తరలిస్తుంటే ఐటీ, కేంద్ర సంస్థలు ఏం చేస్తున్నాయి. అదానీ, అంబానీ నుంచి డబ్బులు వెళ్తుంటే వారి ఇళ్లలో సోదాలు చేయండి. అదానీ, అంబానీ ఇళ్లలో ఈడీ, ఐటీ సిబ్బందితో తనిఖీలు చేయించండి. ఇలాంటి చిల్లర మాటలు మాట్లాడటం ప్రధాని స్థాయికి తగదు అని మల్లికార్జున్ ఖర్గే హెచ్చరించారు.

## ఏపిలో అక్రమ ఇసుక తవ్వకాలపై సుప్రీం ఆగ్రహం



న్యూఢిల్లీ,మే10:ఏపీలో అక్రమ ఇసుక తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు మైనింగ్ జరిగే ప్రదేశానికి వెళ్లాలని స్పష్టం చేసింది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి తగిన చర్యలు తీసుకోవాలని ధర్మాసనం ఆదేశించింది. అక్రమ మైనింగ్ జరుగుతున్న ప్రదేశాలను ఇప్పటికే గుర్తించినందున తవ్వకాలు నిలిపివేశారా? లేదా? అనేది తనిఖీ చేయాలని సూచించింది. అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకున్నామన్న రాష్ట్ర ప్రభుత్వ వాదనను సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. మీ చర్యలు అన్నీ కాగితాలపైనే ఉన్నాయని.. క్షేత్రస్థాయిలో కనిపించవని న్యాయమూర్తి జస్టిస్ అభయ్ ఎస్ ఓఖా ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అక్రమ తవ్వకాలు వెంటనే ఆపాలని.. అనుమతి ఉన్న చోట కూడా యంత్రాలను ఉపయోగించ వద్దని గత నెల 29న సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఆ తర్వాత కూడా తవ్వకాలు జరిగాయంటూ తేదీ, సమయం, ఇసుక రవాణా చేస్తున్న వాహనాల ఫొటోలను ఎన్జీవో నేత నాగేంద్రకుమార్ అత్యున్నత న్యాయస్థానం ముందుంచారు. అక్రమ ఇసుక తవ్వకాలకు సంబంధించి జగన్ ప్రభుత్వంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తక్షణమే అక్రమ ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని రాష్ట్ర సర్కార్‌కు సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. అక్రమ ఇసుక తవ్వకాలను తక్షణం నిలిపివేయడానికి వెంటనే అధికారుల బృందాలను క్షేత్రస్థాయికి పంపాలని ఉన్నతన్యాయస్థానం ఆర్డర్స్ పాస్ చేసింది. కేంద్ర పర్యావరణ, అటవీశాఖ అధికారులు కూడా క్షేత్రస్థాయికి వెళ్లి అక్రమ ఇసుక తవ్వకాలు ఆపేశారా? లేదా? అన్నది తనిఖీ చేయాలని ఆదేశించింది.ఇసుక అక్రమాలపై వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటామని ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌ను సుప్రీం ధర్మాసనం తిరస్కరించింది. ఏపీ ప్రభుత్వం చర్యలన్నీ కాగితాలకే పరిమితమని.. ఆ విషయం తమకు తెలుసని న్యాయస్థానం పేర్కొంది. వచ్చే గురువారం నాటికి అంటే మే 16న అక్రమ ఇసుక తవ్వకాల నిలిపివేతపై తీసుకున్న చర్యలను అఫిడవిట్ రూపంలో సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

## ప్రజ్వల్ రేవణ్ణ కేసులో కొత్త ట్విస్ట్



బెంగళూరు,మే10: హాసన ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ అభ్యంతరక వీడియోల వ్యవహారంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఆయనపై నమోదైన లైంగిక దౌర్జన్యాల కేసులో ఫిర్యాదు చేసిన ఓ మహిళ మాట మార్చింది. పోలీసుల ముసుగులో వచ్చిన కొందరు వ్యక్తులు తనను బెదిరించి తప్పుడు కేసు పెట్టేలా ఒత్తిడి చేశారని సదరు మహిళ వెల్లడించిందని జాతీయ మహిళా కమిషన్ తెలిపింది. దీనిపై కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి స్పందించారు. పత్యేక దర్యాప్తు బృందాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. సిట్ అధికారులు ఆ మహిళలను బెదిరించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా వాంగ్మూలాలు ఇవ్వకపోతే.. వ్యభిచారం కేసు నమోదు చేస్తామని భయపెట్టినట్లు తీవ్ర ఆరోపణలు చేశారు. 'కిడ్నాప్‌నకు గురైన మహిళను మీరు ఎక్కడ ఉంచారు..? ఆమెను ఎందుకు కోర్టులో ప్రవేశపెట్టలేదు..?' అని ప్రశ్నించారు. కుమారస్వామి చేసిన ఆరోపణలపై కర్ణాటక హోం మంత్రి జి.పరమేశ్వర స్పందించారు. జేడీఎస్ నేతలు చేసే అన్ని ఆరోపణలకు సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. సిట్ దర్యాప్తు నిర్వహిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై నమోదైన లైంగిక దౌర్జన్యం కేసుకు సంబంధించి అక్కడి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. హాసనకు చెందిన జేడీఎస్ మహిళా కార్యకర్త ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ప్రజ్వల్‌పై అత్యాచారం కేసు నమోదు చేశారు. వీటితోపాటు అసభ్యంగా ప్రవర్తించడం, బెదిరించి అభ్యంతరకర ఫొటోలు తీయడం వంటి అభియోగాలు మోపారు. ప్రస్తుతం ప్రజ్వల్ విదేశాలకు పారిపోయారు. అతడిని రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆరోపించిన సంగతి తెలిసిందే. వారికి తెలియకుండా నిందితుడు దేశం విడిచి పారిపోయే అవకాశం లేదన్నారు. ఈ క్రమంలో అతడి దౌత్య పాస్‌పోర్టును రద్దు చేయాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశానని చెప్పారు.

## సంపాదకీయం

**శనివారం 11-05-2024**

# బీసీలూ.. బహుపరాక్!

వేటగాళ్ల వాగ్దానాలు, వంచకుల వలు ఎప్పటిలాగే ఈ పార్లమెంట్ ఎన్నికల్లోనూ వంచితుల చుట్టూ మోహరించాయి. సుదీర్ఘ ప్రజాస్వామ్య చరిత్రలో వివక్షను దేశం నలుమూలల వనంలా పెంచి పోషించిన రెండు జాతీయ పార్టీల అగ్రనేతలే.. న్యాయం, నమ్మకం అంటూ మళ్లీ మాయ చేయడానికి కుయుక్తుల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. పూలే జీవించి ఉంటే, అంబేద్కర్ మన మధ్యలో ఉంటే.. కమలం, హస్తం పార్టీలు తెలంగాణతో పాటు దేశంలో జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల ప్రచారంపై పిడుగుల వర్షం కురిపించేవారు. నయవంచకులే న్యాయ సూత్రాలు వల్లిస్తే, బడుగులు అడుగు ముందుకేయకుండా అడ్డుగోడలు నిర్మించిన పక్షపాతాలే ప్రజాస్వామ్యంపై ప్రవచనాలు ఊదరగొడుతుంటే వెయ్యి పీనుగులు తిన్న రాబందు.. శాకాహార ప్రయోజనాలను ప్రచారం చేస్తున్నట్టుగా ఉందా? ఇప్పుడు రాహుల్‌గాంధీ, మోదీ ప్రదర్శిస్తున్న ఎన్నికల విన్యాసాలు కూడా ఉన్నాయి. ఇంకా విచిత్రమేమిటంటే.. ఊసరవెల్లి కూడా ఊరివేసుకునేలా సీఎం రేవంత్ రెడ్డి సైతం జనగణన, బీసీల హక్కులు, సామాజిక న్యాయం, వాటా, కోటా అంటూ చిలుకపలుకులు పలుకుతున్నారు. తెలంగాణ ఎ నిజమే.. 'వినేవాడుంటే చెప్పేవాడికి ఎప్పటికీ లోకువే' అనే నానుడి గాలికి పుట్టలేదు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే అంబేద్కర్ ఆశయాలకు తలకొరివి పెట్టి, పూలే భావనను పూడ్చి పెట్టే పనితీరును నిత్యం కొనసాగిస్తున్నది రేవంత్‌రెడ్డి సర్కార్ కాదా? మంత్రిమండలిలో, నియమిత పదవుల్లో, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సీట్లు, వాటాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏయే కులాలకు ఎంత వడ్డించిందో అందరికీ అర్థమైపోయింది. చివరికి న్యాయవ్యవస్థలో అత్యంత కీలకమైన అడ్వకేట్ జనరల్, అడిషనల్ అడ్వకేట్ జనరల్ బాధ్యతలను ఇప్పటి సీఎంల ఒకే వర్గం వారికి గతంలో ఏ ప్రభుత్వం అప్పగించలేదు. ఇలా నాలుగు నెలల్లోనే వాటా హక్కును నడివీధిలో నవ్వుల పాలుచేసిన చర్యలు ఎన్నో? కానీ, గురివింద గింజ నైజం రేవంత్‌రెడ్డి సర్కార్‌కు, రాహుల్‌గాంధీ పార్టీకి కొత్తేం కాదన్నది దేశంలోని బుద్ధిజీవులందరికీ తెలిసిన సత్యమే. ఆ కుట్రల ఒరవడిలోనే నేడు జనగణన, బీసీల వాటా, రిజర్వేషన్లు అనే సున్నితమైన, కీలకమైన సామాజిక రాజకీయ పబ్బం కోసం వెంపర్లాడుతున్నది. బహుశా మన దేశంలో లాగా, విపణిలో బీజేపీ, కాంగ్రెస్ ద్రోహ పూరిత చరిత్ర కలిగిన రాజకీయ పార్టీలు ఇంత కాలం జనాలను ఏమరు కొనసాగిస్తూ సాగడం దుస్సాధ్యమేమో. సమ్మిళిత అభివృద్ధి, శాంతి, సామాజిక న్యాయం ఇలా ఏ అంశంలోనైనా, ఎండమావుల చుట్టూ ఏండ్లు తిప్పి ఏమరుస్తూ.. అతిపెద్ద మానవ సమూహాన్ని బంతాటలా ఆడుకోవడం ఇతర అభివృద్ధి చెందిన దేశాల్లో అయితే చెల్లుబాటు అయ్యేదా? మన ప్రజల అమాయకత్వాన్ని నినాదాలకు బానిసలుగా మలుస్తూ, పల్లకీలో ఊరేగుతున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు, ఇంకా ఎంతకాలం అధిక జనాభాను జోకొట్టి, దేశాన్ని కొల్లగొడుతూ ఉంటాయి? ఎకనామిక్ హిట్ మ్యాన్ అనే పుస్తకం అమధ్య ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అది తెలుగులోనూ దళారీ పశ్చాత్తాపం పేరుతో ప్రచురితమైంది. ప్రపంచ బ్యాంకులో పనిచేసిన ఈ పుస్తక రచయిత వర్ధమాన దేశాల సంపద ఎలా కొల్లగొట్టబడుతున్నదో అనుభవపూర్వకంగా, ఆధారాలతో రాసి ప్రపంచ పాఠకుల గుండెలు మండేలా చేశారు. అదోక పాప ప్రాయశ్చిత్త, దోపిడీ, పీడన వ్యతిరేక మానవీయ రచన. కానీ, నేడు రాహుల్ గాంధీ ప్రసంగాలు అలా కూడా లేవు కదా? దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ దేశంలో చేసిన అన్యాయ పాలన, పీడన, దోపిడీపై రాహుల్‌గాంధీ మాటల్లో ఇసుమంతైనా ప్రాయశ్చిత్తం కావడం లేదు. అసలు రిజర్వేషన్లు బీసీలకు అందకుండా దగా చేసిందే కాంగ్రెస్ అనే వాస్తవం నేడు కొన ఊపిరితో ఉన్న కాంగ్రెస్ మొసలి కన్నీటితో కడుక్కోలేదు కదా? 90 ప్రభుత్వ శాఖల్లో కార్యదర్శులుగా బీసీలు కేవలం ముగ్గురే ఉన్నారని, న్యాయ వ్యవస్థతో పాటు అన్నింటా సగం జనాభా అయిన బడుగులు అట్టడుగునే పడి మగ్గుతున్న కాంగ్రెస్ అగ్రనేత వల్లిస్తున్న ఊకదంపుడు ఉపన్యాసం వాస్తవమే. కానీ, ఈ అసమాన అన్యాయ వ్యవస్థకు బలమైన పునాదులు పేర్చిందే హస్తం పార్టీ కదా. రిజర్వేషన్లకు కట్టింది కాంగ్రెస్ పార్టీ అయితే, సమాధిని నిలబెట్టింది బీజేపీనే కదా? పెరియార్ పోరాట ప్రభంజనంతో లేదా బీసీల కోసం మొదటి రాజ్యాంగ సవరణ కోసం హస్తం పార్టీకి చేతులు రాలేదు. కాకా కాలేల్కర్ కమీషన్ 1953లో బీసీలకు రిజర్వేషన్లు ఉంటే, ఆయన్ను ఆనాటి కాంగ్రెస్ ప్రధాని నెహ్రూ పార్లమెంట్ సెంట్రల్ హాల్‌కు పిలిపించుకొని, మందలించి, డీసెంట్ నోట్ రాయించి బీసీల భవనానికి ఆదిలోనే మోకాలడ్డం పెట్టారు. తర్వాత 1993 దాకా బీసీ రిజర్వేషన్లు అమలు కాకుండా నాలుగు దశాబ్దాల పాటు బీసీల వాటాను వధించిందే కాంగ్రెస్ ప్రభుత్వాలు. మండల్ కమీషన్‌పై పార్లమెంట్‌లో చర్చ సందర్భంగా బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ, అవి దేశానికి ప్రమాదకరమైనవని సుదీర్ఘంగా ప్రసంగించారు, బీసీల జీవితాల్లో చీకటి కుమ్మరించిందే రాజీవ్‌గాంధీ అనే సత్యం బుద్ధిజీవులందరికీ తెలుసు. తీరా సుప్రీంకోర్టు తీర్పుతో బీసీ రిజర్వేషన్లు అమలులోకి రావడానికి రెండేండ్ల ముందే అనగా 1991లోనే ప్రపంచీకరణ విధానం పేరుతో, ప్రైవేట్ రంగానికి తలుపులు బార్లా తెరిచి బడుగుల కుండకు చిల్లులు పెట్టింది హస్తం సర్కార్ పెద్దలే కదా? ఏడున్నర దశాబ్దాలుగా జనగణనతో పాటు అనేక అంశాల్లో కాంగ్రెస్ సర్కార్ల వంచన, కమలం పార్టీ పెద్దల సమర్థింపు వల్ల వివక్షకు వేలాడిన బీసీల హక్కులు ప్రతి సందర్భంలోనూ పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డాయే కానీ వారి రొట్టె విరిగి నెయ్యిలో పడలేదు. బీసీల కాళ్లు కాంగ్రెస్ విరగ్గొడితే, నేడు బీజేపీ ఏకంగా తినే చేతులనూ తెగనరుకుతోంది. కేంద్ర ప్రభుత్వ సిబ్బంది సంఖ్య 41.76 లక్షల నుంచి 34.5 లక్షలకు కుదించడమే కాదు, 16 లక్షలకు పైగా కేంద్ర ప్రభుత్వ కొలువులను భర్తీ చేయకుండా బీసీ రిజర్వేషన్లను ఎగ్గొట్టింది మోదీ ప్రభుత్వం. దానికితోడు ప్రైవేటీకరణ కాదు.. కాదు.. అదానీకరణకు అంతా సమర్పిస్తూ.. అడిగేందుకు ఏమీ మిగలని దశకు దేశాన్ని తాకట్టు పెడుతున్నారు. నిజానికి రిజర్వేషన్లు ఎత్తేస్తే కుట్ర కాదు, ఏనాడో వాటిపై నిషేధాజ్ఞలను రెండు జాతీయ పార్టీలు అప్రకటితంగా అమలు చేసేశాయి. ఇక రాజ్యాంగానికి తూట్లు కాదు, ఏకంగా పోట్లే పొడిచి, ప్రవేశిక లక్ష్యాల పీక నొక్కేశాయి. అలాగే 2021లో బీసీల జనగణన 2018లో ఆనాటి హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చి, తర్వాత పంగనామం పెట్టారు. ఇలా ఎన్నో అంశాల్లో విలువల వధలో వీడు ఉక్కు కాదు, వాడు తుక్కు కాదని చెరబండ రాజు అన్నట్టుగా కమలం, హస్తం పార్టీలు బీసీల హక్కుల హననంలో పోటీ పడి పనిచేశాయి. అసలు రాజ్యాంగం అర్థం కానీ కాంగ్రెస్, ఇష్టమేలేని బీజేపీలూ.. ఎన్నికలను కనికట్టుగా, పరిపాలనను సర్కస్ ఫీట్లుగా మార్చేశాయి. రాజకీయాలను గుప్పెడు మంది గుత్తసొత్తుగా మార్చి, బలవంతులదే రాజ్యమనే రాతియుగ భావనను బలపరిచాయి. ఢిల్లీలో గాంధీ కుటుంబం, నిరూపించానికో సామాజిక వర్గం సొత్తుగా హస్తం పార్టీ.. విస్తరణకు విద్వేషం, విధానాలు కుబేరుల కోసం అంటూ కమలం పార్టీ మనుగడ సాగిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఏనాడో ప్రమాదంలో పడేశాయి. వాస్తవానికి దేశాన్ని ఇలా వివక్షావనంలా మార్చివేసిన కుసంస్కార కాంగ్రెస్, బీజేపీ విధానాలను అభివృద్ధి చెందిన వర్గాల్లోని బుద్ధిజీవులు సైతం ఈసడించుకోకుండా ఉండలేరు. ఇంకా నయం వివక్షలకు వ్యతిరేకంగా ప్రాంతీయ పార్టీలు పురుడుపోసుకోకపోయి ఉంటే నేటికీ అరాచకమే అంతటా వర్ధిల్లేది. అసలు స్వాతంత్ర్య ఉద్యమంలోని సామాజికాంశంలో రాజ్యాంగంలోని

# గజ యుద్ధంలో భారత్ ఆయుధాలు!



ఇజ్రాయెల్‌కు ఆయుధాలు అమ్మరాదని ఐక్యరాజ్య సమితి మానవహక్కుల కమిటీ ఏప్రిల్ 5న తీర్మానం చేసింది. ఈ తీర్మాన సమావేశానికి భారత దేశం గైర్హాజరైంది. పాలస్తీనా పైన ఫ్రాన్‌సిస్కా అల్బనెస్ తయారు చేసిన 'అనాటమీ ఆఫ్ జెనోసైడ్' అన్న ఐక్యరాజ్య సమితి ప్రత్యేక నివేదికలో గాజాపై ఇజ్రాయెల్ ఎలా మారణహోమానికి హాజరైంది. ఈ నివేదిక వచ్చిన రెండు వారాలకు ఐక్యరాజ్యసమితి మానవహక్కుల కమిటీపై సమితి తీర్మానం చేసింది. అంతర్జాతీయ న్యాయస్థానం మారణ హోమంపై జనవరిలో చేసిన ప్రాథమిక తీర్మానాలను గాజాపై చేసిన దాడిలో ఇజ్రాయెల్ ఉల్లంఘించిందని ఐక్యరాజ్య సమితి ప్రత్యేక నివేదిక గుర్తించింది. భారత్ ఇజ్రాయెల్ ప్రభుత్వాలు, వాటి ప్రైవేట్ కంపెనీలు ఇజ్రాయెల్‌తో యధావిధిగా ఆయుధ వ్యాపారం కొనసాగిస్తూనే ఉన్నాయి. భారత దేశానికి చెందిన ఏరో స్పేస్ సర్వీస్, ఇజ్రాయెల్‌కి చెందిన ఇజ్రాయెల్ ఏరో స్పేస్ పరిశ్రమ గత మార్చిలో భారత దేశంలో ప్రారంభించబడింది. భారతీయ మధ్యతరహా అడ్మిషన్ మిజైల్ విధానం మాత్రమే భారత అధికారిక తయారీ పరిశ్రమ. మధ్యతరహా వసతి మిజైల్ పాత్ర ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండియా, భారత దేశానికి చెందిన డిఆర్‌డిఒ కలిసి 2017లో 1.6 బిలియన్ డాలర్ల ఒప్పందంతో అభివృద్ధి చేశాయి. ఇజ్రాయెల్‌లో ఇదే అతిపెద్ద రక్షణ రంగ ఒప్పందం అని ఇజ్రాయెల్ ఏరో స్పేస్ ఇండస్ట్రీ ఒక ప్రకటనలో ఆనాడే చెప్పింది. 'భారత దేశం ప్రపంచంలోనే అత్యధిక ఆయుధాలు దిగుమతి చేసుకునే దేశం' అని స్టాక్ హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చి ఇన్‌స్టిట్యూషన్. ఇజ్రాయెల్ అమ్మే ఆయుధాల్లో అత్యధికంగా, అంటే 37% ఒక్క భారత దేశమే దిగుమతి చేసుకుంటుందని. ఎగుమతుల్లో ఇజ్రాయెల్‌కు 20హెర్మ్స్‌ని, 900 డ్రోన్లలను ఎల్బిట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ద్వారా పంపినట్టు గడిచిన ఫిబ్రవరిలో నివేదించబడింది. అదానీ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్, ఇజ్రాయెల్ ఎల్బిట్ సిస్‌తో సంయుక్తంగా పని చేయడం 2016లో ఒక నిర్ణయానికి వచ్చింది. రెండేళ్ళ తరువాత అదానీ ఎల్బిట్ సిస్టం హైదరాబాదులో డ్రోన్‌లు తయారీ సంస్థను ఏర్పాటు చేసి, అక్కడినుంచే వాటిని ఇజ్రాయెల్‌కు ఎగుమతి చేస్తోంది. నాలుగేళ్ళ తరువాత అదానీ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్ మరో ఇజ్రాయెల్ ఆయుధ పరిశ్రమ కంపెనీతో చేరి ప్రిసైస్ లెథల్ రిలైబుల్‌లో అత్యధిక షేర్లను కొనుగోలు చేసింది. ఇజ్రాయెల్ రక్షణశాఖ కోసం ఇజ్రాయెల్ వెపన్ ఇండస్ట్రీ మారణాయుధాలను కొనుగోలు చేస్తుంది. ఒకప్పుడు ఇరాన్ షాకు ఆయుధాలు అందించే వ్యాపారి సమీ కాత్సవ్‌కు చెందిన ఎస్‌కే గ్రూపుకు ఇది అనుబంధం. పుంజి ఎల్లాయిడ్ రక్షా సిస్టం, ఇజ్రాయెల్ వెపన్ ఇండస్ట్రీస్. దాన్ని అదానీ స్వాధీనం చేసుకున్నాక దాని పేరు కాస్త 'ప్రిసైస్ లెథల్ రిలైబుల్'గా మారింది. ఇది అసాల్ట్ రైఫిళ్ళు, మెషిన్ గన్‌లు, గ్రెనెడ్ లాంచర్లను తయారు చేసి భారత దేశానికి చెందినవిగా అమ్ముతుంది. ఇది భారత దేశంలో తొలి ప్రైవేటు ఆయుధ తయారీ సంస్థ. ఈ ఏడాది బెంగళూరులో జరిగిన ఏరో ఇండియా కాన్ఫరెన్స్‌లో హెర్మ్స్ 900 ఎగుమతిదారులతో పాటు ఇజ్రాయెల్ రాఫెల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్ తమ రక్షణ రంగ ప్రసారాన్ని ప్రదర్శించింది. అదానీ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్ వంటి రాఫెల్ సిస్టం కూడా ఇజ్రాయెల్‌కు చెందింది. కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టం రాఫెల్‌తో చేరి 2015లో భారత్ ఫోర్జ్ సొంతమైంది. ఇలా సంయుక్తంగా ఏర్పడిన కళ్యాణ్ రాఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టం భారత తొలి మిస్సైల్ తయారీ కంపెనీగా అవతరించింది. భారత రక్షణ మంత్రిత్వ శాఖ మిస్సైళ్ళ కొనుగోలుకు కళ్యాణ్ రాఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టంకు 287 కోట్ల రూపాయలను ఇచ్చింది. ఇజ్రాయెల్ రక్షణ కంపెనీలు తమ ఆయుధాలను అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్మడానికి ముందు వాటిని పాలస్తీనాలో పరీక్షిస్తాయి. 'ద పాండా' అనే మానవ రహిత బుల్డోజర్లను గాజాలో ప్రయోగిస్తున్నారని ఇజ్రాయెల్ న్యూస్ ఏజన్సీ హారెట్జ్ రాసింది. పెద్ద ఎత్తున విధ్వంసం సృష్టించడానికి డి9 బుల్డోజర్‌ను ఉపయోగిస్తారని హూప్రాఫిట్ రీసెర్చి సెంటర్ విడుదల. ఇజ్రాయెల్ ఆక్రమిత పాలస్తీనా, సిరియా భూభాగంలో ఇది వ్యాపారాన్ని తెరిచింది. గాజాలో ఉపయోగించే ఈ బుల్డోజర్లు ఇజ్రాయెల్ నిర్మించినవే. ఐఐఐలో ప్రసిద్ధి చెందిన 'హిరాన్ టిపి డ్రోన్' ఎక్కువ ప్రాణాలు తీసే డ్రోన్‌గా ప్రసిద్ధి చెందింది. జర్మనీకి చెందిన ఈ రకమైన రెండు డ్రోన్లు ఇప్పటికే పాలస్తీనాలో ఉన్నాయి. వీటిని పాలస్తీనాలో ఉంచినవని ఆరోపిస్తూ నికరాగువా గత మార్చిలో జర్మనీపైన అంతర్జాతీయ కోర్టులో వేసిన కేసులో గుర్తించబడింది. గా జాలో మారణ హోమం సృష్టించాలని జర్మనీ కంకణం కట్టుకున్నదని నికరాగువా ఆరోపించింది. జర్మనీకి వ్యతిరేకంగా నికరాగువా చేసిన ఆరోపణలను దృష్టిలో ఉంచుకుని అంతర్జాతీయ న్యాయస్థానం ఆయుధాలను అమ్మేటప్పుడు మారణ హోమానికి దారి తీయకుండా చూడాలని గత ఏప్రిల్ 30న జర్మనీకి సూచించింది. దీనితో పాటు బరన్‌స్టింగ్ బాంబు కాంక్రీటు గోడలను కూడా బలంగా చీల్చుకుని వెళ్ళిపోతుంది. ఫిబ్రవరిలో జరిగిన సింగపూర్ ఎయిర్ షోలో దీన్ని ప్రదర్శించారు. ఈ కంపెనీ చెప్పినదాని ప్రకారం, 2021లో ఇజ్రాయెల్ జరిపిన పదకొండు 'ఆపరేషన్ గార్డియన్ ఆఫ్ వాల్స్'లో 67 మంది పిల్లలు సహా మొత్తం 256 మంది పాలస్తీనా పౌరులు మరణించారు. ఈ కంపెనీలు పాలస్తీనా సహా ప్రభుత్వం చేపట్టే హింసవల్లనే లాభాలు ఆర్జిస్తున్నాయి. తెల్ల ఫాస్పరస్ ఆయుధాలను ఈ ఎల్బిట్ కంపెనీ తయారు చేస్తోందని అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమీషన్‌కు 2012లో సమర్పించిన వార్షిక నివేదిక. గాజాలో స్వచ్ఛందంగా పని చేస్తున్న అమెరికన్ ఫ్రెండ్స్ సర్వీస్ కమిటీ పరిశోధనాత్మకంగా సేకరిస్తుంది. ఈ నెల అక్టోబర్ నుంచి గాజాపై ఇజ్రాయెల్ దాడి సహా, ఇజ్రాయెల్ ఏరోస్పేస్, ఎల్బిట్ సిస్టం, రాఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టం, ఎస్.కె గ్రూప్ జాబితాలో ఉన్న కంపెనీల గురించిన సమాచారం ఇందులో ఉంది. గత త్రైమాసికంలో ఎల్బిట్ సిస్టం ఆదాయం 1.6 బిలియన్ డాలర్లు, అంతకు ముందు త్రైమాసికంతో పోల్చుకుంటే ఇది 7% ఎక్కువ. ఇజ్రాయెల్‌కు ఆయుధాలు అమ్మడం వల్ల ఎల్బిట్‌కు 12 శాతం లాభాలు వచ్చాయి. ఈ కంపెనీ స్థాపించినప్పటి నుంచి ఇది అత్యధిక వసూళ్ళని ఐఐఐ నివేదిక వెల్లడించింది. 2023 అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు త్రైమాసికంలో దీనికి 1.4 బిలియన్లు లభించాయి. గడిచిన త్రైమాసికంలో దేశం యుద్ధంలో ఉండటం వల్ల, ఇజ్రాయెల్ ఏరో స్పేస్ ఇండస్ట్రీ ఆర్థిక నివేదిక 2023 చాలా బాగుందని, ఆ కంపెనీ సిఐఒ బోజాలెవి చెప్పారు. రాఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ అమ్మకాలు 19% పెరగడం వల్ల 2022 గడిచిన త్రైమాసికంలో 1.2 బిలియన్ డాలర్ల అమ్మకాలు పెరిగాయి. ఐఎఐకి 18 బిలియన్ డాలర్లు, ఎల్బిట్ సిస్టంకు 17.8 బిలియన్ డాలర్లు, రాఫెల్‌కు 14 బిలియన్ డాలర్ల లాభాలు లభించాయి. గాజాపై యుద్ధం, మారణహోమం సందర్భంలో వారి వ్యాపారం వెలిగిపోతోందంటే, ప్రత్యక్షంగానైనా, పరోక్షంగానైనా ఇజ్రాయెల్ పాలస్తీనాను ఆక్రమించడం, పాలస్తీనాకు వ్యతిరేకంగా మానవహక్కులను ఉల్లంఘించడమే అవుతుంది. ఆక్రమిత పాలస్తీనాలో 'చట్టవ్యతిరేక నిర్ణయాలకు మద్దతు తెలపడం, కొనసాగించడమే' దాని పని అని ఐఎఐపైన ముద్రపడింది. మానవులను చంపేస్తే డ్రోన్లను, ఇతర ఆయుధాలను తయారు చేయడం అంటే మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడడమే అవుతుంది. ఎల్బిట్ సిస్టమ్స్ ఆయుధాలు, వాటి చెక్ పాయింట్లు పాలస్తీనాకు వ్యతిరేకంగా జరిగే 'యుద్ధ నేరాలకు' సాయపడడమేననే ముద్ర పడింది. డిఆర్డిఒ, అదానీ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్, భారత్ ఫోర్జ్‌ల ప్రతినిధులను వీటిపై ఇమెయిల్ ద్వారా వ్యాఖ్యానించమని అడిగాను. 'భారత అంతరిక్ష కార్యక్రమాలు, దాని అవసరాల కోసం కళ్యాణి, రాఫెల్ అత్యాధునిక విధానాలతో సంయుక్తంగా పని చేయడానికి 2015 ఆగస్టులో ఒప్పందం కుదుర్చుకున్నా దాని అస్తిత్వం ఎలాంటి ఎగుమతులతో ముడిపడి లేదు. కళ్యాణి గ్రూపు భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన వివిధ ఎగుమతి విధానాలకు కట్టుబడి ఉన్న సంస్థ' అని తెలియజేసింది. ఒప్పందం ఎఇఎల్, డిఆర్‌డిఒ ప్రతినిధులు స్పందించలేదు. ఇజ్రాయెల్‌పైన ఆయుధ ఆంక్షలుస్తూ ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కమిటీ సమావేశానికి మీరెందుకు గైర్హాజరయ్యారని భారత ప్రతినిధిని అడిగితే, వారి నుంచి సమాధానం లేదు. పాలస్తీనాకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ మారణహోమానికి హానితోందని, అంతర్జాతీయ న్యాయస్థానం ఇచ్చిన రూలింగ్ చాలా న్యాయమైందని పాలస్తీనాకు మిలిటరీ నిషేధిత సమన్వయ కర్త షిర్ హెవెర్ జరిగింది. 'ఇజ్రాయెల్ సైన్యం ఆయుధాలను ఉపయోగించి ఏ అన్యాయాలకైతే రక్షణతోంది, ఇలాంటి ఇబ్బందులు వారికి ముందుగా తెలియదని భారత అధికారులు, భారత కంపెనీలు వాదించలేవు' అని ఆయన అంటారు.

# మోడీ వల్లే సామాజిక న్యాయం.. కేంద్ర మంత్రి మురుగన్



అచ్చంపేట : సామాజిక న్యాయం మోదీ వల్లే సాధ్యమని, మోదీ తిరిగి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసత్యపు ప్రచారాలు చేస్తున్నారని కేంద్ర ప్రసార, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి ఎల్.మురుగన్ అన్నారు. గురువారం అచ్చంపేట పట్టణంలోని భాజాపా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ%ా%. మోడీ వల్లే దేశంలో సామాజిక న్యాయంతో పాటు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వంలో 27 ఓబిసి, 12 ఎస్సీ, 10 మహిళా, 9 ఎస్టీ వర్గాల వారికి చోటు కల్పించడమే మోడీ సామాజిక న్యాయానికి నిదర్శనమని 12 మంది ఎస్సీ మంత్రులలో తాను ఒకరిని అని అన్నారు. ఈ ఎన్నికలలో భాజాపా 400 సీట్లు గెలిచి ముచ్చటగా మూడవసారి కూడా మోడీనే ప్రధానమంత్రి కావడం గ్యారెంటీ అని అన్నారు. మోడీ వల్లే నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లో 2 వేల నాలుగు వందల కోట్ల రూపాయలతో ఆసియాలోనే అతి పెద్ద, ఇండియాలోనే మొట్టమొదటిగా సోమశిల ఐకాన్, హైవే బ్రిడ్జి నిర్మాణం మంజూరి చేసి పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. మోడీ గొంతులో ఊపిరి వున్నంత వరకు రిజర్వేషన్లను తీయనీయడని, గత అసెంబ్లీ ఎన్నికలలో పేరేడ్ గ్రౌండ్‌లో మందకృష్ణ మాదిగతో కలిసి ఎస్సీ వర్గీకరణ హామీ, నిన్న వరంగల్ మీటింగ్‌లో రిజర్వేషన్లపై ఇచ్చిన క్లారిటీ, ఎస్సీ, ఎస్టీ, బిసి రిజర్వేషన్లలో కుదింపు చేయకుండా అగ్రవర్ణాల నిరుపేదలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ కల్పించడం, 2014లో రాష్ట్రపతిగా దళిత సామాజిక వర్గానికి చెందిన రామ్‌నాథ్ కోవింద్‌తో పాటు నేడు ఆదివాసి మహిళ అయిన ముర్మును రాష్ట్రపతిగా ఈ దేశానికి అందిచడం మోడీ సామాజిక న్యాయానికి నిదర్శనం కాదా అని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీయే రంగనాథ్ కమిషన్ ద్వారా ఎస్సీ, ఎస్టీల రిజర్వేన్లను తొలగించాలని ప్రయత్నించారన్నారు. కిషన్‌రెడ్డి కేంద్రమంత్రిగా జోగులాంబ అమ్మవారి గుడిని అభివృద్ధి చేసిట్లుగానే ఉమామహేశ్వర దేవాలయాన్ని కూడా చేయుటకు ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. 30 సంవత్సరాల తన రాజకీయ ప్రస్థానంలో పోతుగంటి రాములు నిస్వార్థంగా, సాదాసీదాగా జీవిస్తూ ప్రజలకు సేవలందిస్తూ వచ్చారని, ఆయన వారసుడ్కెన పోతుగంటి భరత్ ప్రసాద్‌ను పార్లమెంట్ అభ్యర్థిగా పువ్వు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించినట్లయితే అలంపూర్, మున్ననూర్ బూత్‌పూర్ హైవేలు, గద్వాల నుండి దోర్నకల్ రైల్వే ల్కెన్‌లతో పాటు ఇక్కడ ఆయుర్వేద యూన్నివర్సిటిని మంజూరు చేయిస్తాడని హామీ ఇచ్చారు. మే 11న చివరి పార్లమెంట్ ప్రచారం ముగింపునకు వనపర్తికి కేంద్రమంత్రి అమిత్‌షా వస్తున్నారని, ఆ మీటింగ్‌కు భాజాపా శ్రేణులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మంగ్యా నాయక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మండికారి బాలాజీ, రాష్ట్ర, జిల్లా నాయకులు నరేందర్ రావు, జగదీశ్వర్ రెడ్డి, కొండల్ రెడ్డి, నాగరాజు, సైదులు, అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి ముక్యాల రేణయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు జానకి, స్థానిక నాయకులు గోపాల్ యాదవ్, పత్యా నాయక్, శంకర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి ప్రాంతంలో తనిఖీల్లో 22 లక్షల నగదు స్వాధీనం

హైదరాబాద్, ఎన్నికల నేపథ్యంలో భాగంగా బాచుపల్లి ఎస్ఓటీ, బాలానగర్ పోలీసులు సంయుక్తంగా వాహనాలను తనిఖీలు చేపట్టారు. కూకట్‌పల్లి పరిసరాల్లో చేపట్టిన తనిఖీల్లో రూ. 22 లక్షలను పోలీసులు గురువారం పట్టుకున్నారు. బాచుపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ శ్రీకృష్ణనగర్‌కాలనీకి చెందిన పి.అఖిల్, బోడుప్పల్ బుద్ధానగర్‌కు చెందిన శశికిరణ్‌లు తెలంగాణ గోల్డ్ బయ్యర్స్‌లో మార్కెంటింగ్ చేస్తుంటారు. గురువారం బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తుండగా రెండు ద్విచక్ర వాహనాల్లో రూ. 22 లక్షలు లభించాయి.

# నిస్వార్థ సమర యోధుడు..గోపాలకృష్ణ గోఖలే !

న్యూఢిల్లీ, దేశం కోసం ప్రాణాల్ని సైతం లెక్క చేయకుండా ఉద్యమాలకి ఊపిరి పోసిన ఎందరో సమరయోధుల్లో గోపాల కృష్ణ గోఖలే ఒకరు. నేటి తరంలో చాలామంది ఈ పేరు కూడా విని ఉండరు. కానీ, ఆయన నాయకత్వ పటిమ గురించి ఒక్కసారి చదివితే ఖచ్చితంగా మర్చిపోరు. జాతిపితగా నేటికీ అందరి మన్ననలు పొందుతున్న మహాత్మ గాంధీజీ గోఖలేని తన గురువుగా అభివర్ణించారంటే గోఖలే వ్యక్తిత్వం ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు.. మే9 మహానుభావుడి జన్మదినం సందర్భంగా ఆయన గురించి చరిత్ర చెప్పిన కొన్ని నిజాలు తెలుసుకుందాం..1866 మే 9వ తేదీన ఓ సాధారణ బ్రాహ్మణుల కుటుంబంలో జన్మించారు గోఖలే. ఆయన స్వగ్రామం మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా గుహాగర్ తాలూకా కొట్లాక్ గ్రామం. ఆస్థిపాస్తులు పెద్దగా లేకపోయినా అప్పట్లోనే గోఖలేకి ఆంగ్ల విద్యని చెప్పించారు ఆయన తల్లితండ్రులు. దేశంలో మొట్టమొదట ఆంగ్ల విద్యని అభ్యసించిన భారతీయుల్లో గోఖలే ఒకరు. ఆయన చదువుల్లో రాణించి ఆంగ్ల భాషపై పట్టు సంపాదించడంతో బ్రిటిష్ ప్రభుత్వ ఉద్యోగిగా నియమితు డయ్యాడు. నేర్చుకున్న విద్య ఆయన ఆలోచనల్లో కొత్త ఒరవడిని తీసుకొచ్చింది. రాజకీయాలలో పాల్గొనటానికి నమ్మకస్తుడైన వ్యక్తి కోసం ఎదురు చూస్తున్న జస్టిస్ మహాదేవ్ రానడేకి గోఖలే పరిచయమయ్యాడు. గోఖలేకి రాజకీయాల పట్ల ఉన్న ఆసక్తి, పట్టుదల గమనించిన రానడే గోఖలేని శిష్యుడిగా చేసుకున్నాడు. రానడే స్థాపించిన 'పూనా సార్వజనిక్' సభ నిర్వహించే పత్రికా సంపాదకుడిగా గోఖలేకి బాధ్యతలు అప్పగించి చిన్న వయసులోనే రాజకీయ జీవితానికి నాంది పలికారు. విద్య ద్వారానే భారతీయులు అభివృద్ధి చెందగలరని అభిప్రాయపడి జనాలను చైతన్యపరచడం మొదలు పెట్టాడు. 1904లో నౌరోజీ పిలుపునిచ్చిన స్వపరిపాలనకు మద్దతుగా గోఖలే తన గొంతు కలిపాడు. వాడవాడలా తిరుగుతూ తన ఉపన్యాసాలతో ప్రజలను చైతన్య వంతులుగా చేశాడు. నౌరోజీ విదేశాలకు వెళ్ళి అక్కడి ప్రభుత్వాలకు భారతదేశ గోడు వినిపించేలా చేసేవాడు. దేశంలో గోఖలే, విదేశాల్లో నౌరోజీ ఎంతో కృషి చేసి, సభలు జరిగిన ప్రతులను ప్రభుత్వానికి అందేలా చేసేవారు. వీరి ఇరువురి వాణి విద్యావంతుల్ని ప్రభావితం చేసింది కానీ, చదువులేని వారికి చేరేది కాదు. బ్రిటీష్ ప్రభుత్వ కమిషన్‌లో మాట్లాడే అర్హత సంపాదించుకున్నాడు. ఒక గొప్ప సామాజిక, సాంఘిక, రాజకీయవేత్తగా ఆయన పోరాడి, చివరికి ఆయన జీవితం రాజకీయ చదరంగంలోనే ముగిసింది. 1915వ సంవత్సరంలో ఫిబ్రవరి 19న గోఖలే తన తుదిశ్వాస విడిచారు. దేశం కోసం ధైర్యంగా, నిజాయితీగా ముందడుగు వేసిన మహానుభావుడిని స్మరించుకోవడం భారతీయులుగా మన కనీస ధర్మం.

## లౌకికి శక్తులకు దక్కనున్న రాజ్యాధికారం

హైదరాబాద్, ఈ ఎన్నికలు దేశంలో చాలా కీలకంగా ఉన్నాయని సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం ఉంటుందా?.. లేదా?, వచ్చే పరిణామాలు తట్టుకుంటాయా?.. లేదా? అనేది ఈ ఎన్నికలు నిర్ణయిస్తాయన్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేసే ప్రయత్నం దేశంలో జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో జరుగుతున్న అనేక దారుణాలపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు ఇచ్చామన్నారు. వాటిపై కనీసం ఎక్‌నాలెడ్జ్‌మెంట్ కూడా ఇవ్వని పరిస్థితి ఇప్పుడు చూస్తున్నామన్నారు. సీబీఐ, ఈడీ కేవలం రాజకీయ కోణంలోనే పని చేస్తున్నాయని విమర్శించారు.

**మోదీ నియంతృత్వ విధానాల వల్ల**

స్వాతంత్ర్యం తర్వాత ఇంత నిరుద్యోగం ఎప్పుడూ దేశంలో చూడలేదని ఏచూరి అన్నారు. నేడు ప్రతి కుటుంబం అప్పులు చేసి పోషించుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. పేదలు మరింత పేదలుగా మారిపోతుండగా, ధనికులు మరింత ధనవంతులుగా పెరుగుతున్నారన్నారు. ఉద్యోగం, ఉపాధి అవకాశాలు లేక బతుకుదెరువు భారం బాగా పడుతుందన్నారు. ఇదంతా మోదీ నియంతృత్వ విధానాలే కారణమని సీపీఎం అభిప్రాయ పడుతుందన్నారు. ఎన్నికల ప్రచారంలో ఈ అంశాలపై మోదీవైపు నుంచి స్పందనే లేదని మండిపడ్డారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో జరిగిన సభల్లో కూడా మోదీ ప్రస్తావించలేదన్నారు.

**అన్నీ అదానీ, అంబానీ పరమేనా?**

వినాశకాలే విపరీత బుద్ధులు అనే సామెత మోదీ విషయంలో అర్థం అవుతోందని ఏచూరి అన్నారు. మోదీ ప్రధాని అయ్యే వరకు అదానీ అనే వ్యక్తి ఎవరో ఎవరికైనా తెలుసా? అని ప్రశ్నించారు. ఇప్పుడు ఎయిర్ పోర్టులు, సీ పోర్టులు, పెట్రో కెమికల్ ఇండస్ట్రీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అన్నీ అదానీ, అంబానీ పరమేనా అని నిలదీశారు. టెంపోలో క్యాష్ ఇస్తున్నారంటే బ్లాక్ మనీ ఉందనేది అర్థం అయిపోతుందన్నారు. అదానీకి, అంబానీ సంస్థలపై ఈడీ, సీబీఐ ఎందుకు దృష్టి పెట్టడం లేదని నిలదీశారు. పోలరైజేషన్‌ను మరింత విస్తృతం చేసి, మతోన్మాదాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారని ఏచూరి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఈ ఎన్నికల తర్వాత**

మొదటి రెండు దఫాలు ఎన్నికలు పూర్తి అయిన తర్వాత మోదీకి ఓటమి తప్పదని తేలిఎయిందని ఏచూరి అన్నారు. అందుకే ఇప్పుడు హిందూత్వం పేరుతో రామ మందిరాన్ని ప్రచారం చేస్తున్నారన్నారు. ఎన్నికల సంఘానికి ఎన్ని ఫిర్యాదులు చేసినా వారు పరిగణలోకి తీసుకోవడం లేదన్నారు. ఈ ఎన్నికల తర్వాత దేశ రాజకీయాల్లో తప్పకుండా పెద్ద మార్పు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి పేరుతో పొత్తులతో మోదీ వెళుతున్నారని.. ఇండియా కూటమితో తాము వెళుతున్నామన్నారు. ఈ ఎన్నికలలో ప్రధాన అంశాలు, సమస్యలను మోదీ ప్రస్తావించడం లేదన్నారు. ప్రజల్లో ఉన్న భావాలను రాజకీయంగా మార్చుకుని మతోన్మాదం కోసం మోదీ ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

**మోదీ ఓటమి భయంతో**

తప్పకుండా ఈసారి దేశంలో మార్పు ఖాయం.. ప్రభుత్వం మారడం తథ్యమని ఏచూరి స్పష్టం చేశారు. ఏపీలో తెలుగుదేశం, రీజనల్ పార్టీలకు బీజేపీ పొత్తు వల్ల వారికే నష్టమన్నారు. ఏపీలో 10 అసెంబ్లీ, 6 లోకసభ స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తుందని.. అంటే ఏపీలో బీజేపీకి ప్రాధాన్యం లేదని అందరికీ అర్థమవుతోందన్నారు. మోదీ ఓటమి భయంతో ఇలా ప్రతి రాష్ట్రంలో తగ్గి మరీ.. రీజనల్ పార్టీలకు మద్దతు ఇస్తున్నారన్నారు. మోదీ మతోన్మాద రాజకీయాలు అర్థం కావడం వల్లే ప్రజలు వారిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ఎలక్ట్రోల్ బాండ్లు కూడా మోదీ అవినీతికి నిదర్శనమని ఏచూరి వ్యాఖ్యలు చేశారు. బీజేపీ చెప్పిన సంస్థలు తమ లెక్కల్లో అప్పులు, నష్టాలు చూపించారన్నారు. మరి అటువంటి వారు బీజేపీకి ఎలక్ట్రోరల్ బాండ్లు ఎలా ఇచ్చారో చెప్పలి కదా అని ప్రశ్నించారు.

**అదానీ, అంబానీలు వికసిస్తే సరిపోదు..**

పార్టీ ఫండ్ పేరుతో మనీ లాండరింగ్‌ను మోదీనే సమర్థిస్తున్నారని ఏచూరి అన్నారు. ఎలక్ట్రోరల్ బాండ్ల ద్వారా కుంభకోణాలను మోదీ లీగలైజ్ చేశారన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఎక్కడ వచ్చిందో.. అక్కడ ప్రజలకు కష్టాలు డబుల్ అయ్యాయని వ్యాఖ్యలు చేశారు. ఆయా రాష్ట్రాల్లో అసలు ఇంజనే వద్దని మోదీని వ్యతిరేకిస్తున్నారని ఎద్దేవా చేశారు. రీజనల్ పార్టీలను విడగొడితేనే.. మోదీ గెలిచే పరిస్థితి లేదని అర్థమైపోయిందన్నారు. వికసిత్ భారత్ అంటే ప్రజల జీవనం వికసించాలన్నారు. కానీ అదానీ, అంబానీలు వికసిస్తే.. దేశం వృద్ధి చెందినట్లు కాదని సెటైర్ వేశారు.

# తెలంగాణలో అత్యధిక స్థానాల్లో బిజెపి విజయం

హైదరాబాద్, సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణతో పాటు దక్షిణాది రాష్ట్రాల్లోనూ బీజేపీ ప్రభంజనం కొనసాగుతుందని రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్‌శర్మ అన్నారు. గతంకన్నా మించి సీట్లను బిజెపి సాధించబోతోందని అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ గగన్‌పహడ్‌లోని సెలబ్రిటీ కన్వెన్షన్‌లో చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో 'ప్రవాసీ సమ్మేళనం' పేరిట నిర్వహించిన చాయ్ పే చర్చ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తెలంగాణలోనూ బీజేపీ అత్యధిక స్థానాలను గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని రాజస్థాన్ యువకులు, వ్యాపారులను కోరారు. రాజస్థాన్‌లో డబుల్ ఇంజన్ సర్కార్ వచ్చిందని, అభివృద్ధి పథంలో దూసుకు పోతున్నదని అన్నారు. తెలంగాణలోనూ అలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ప్రజల భాగస్వామ్యం ఎంతో ఉందని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉత్తరాది నుంచి ఇక్కడికి వచ్చి తెలంగాణ సంస్కృతిలో భాగమై భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తమ పెట్టుబడులు, వ్యాపారాలతో తెలంగాణ యువతకు ఉపాధి కల్పించడంలో రాజస్థానీయుల పాత్ర ఎంతగానో ఉందన్నారు. నరేంద్రమోదీ సర్కార్ అందిస్తున్న సంక్షేమ పథకాలు గ్రామ గ్రామానికి చేరాయని, వాటిని ప్రత్యక్షంగా అందుకుంటున్న లక్షలాది మంది ప్రజలు మరోసారి మోదీని ప్రధానమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజస్థాన్‌కు చెందిన రాజ్యసభ మాజీ సభ్యుడు నారాయణలాల్ పంచారియా, ఆహోర్ ఎమ్మెల్యే చంగన్‌సింగ్ రాజ్పుతోహి, చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ నాయకులు బొక్క నర్సింహారెడ్డి, డాక్టర్ ప్రేంరాజ్‌యాదవ్, టి.అంజన్‌కుమార్‌గౌడ్, వై.శ్రీధర్, పి.మల్లేశ్‌యాదవ్, ఎన్.మల్లారెడ్డి, జోగి రవి పాల్గొన్నారు.

# ఓటేస్తే..కాటేసే రకం జగన్

పార్వతీపురం,ఈ ఎన్నికల్లో వైకాపా ఫ్యాన్ ముక్కలవడం ఖాయం అని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడారు. తెదేపా, భాజపా, జనసేన కూటమి విజయం తథ్యమన్నారు. వైకాపావి నవరత్నాలు కాదు.. నవమోసాలని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలతో ముందుకొస్తు న్నామని చెప్పారు. రాష్ట్రానికి మంచి రోజులు రాబోతున్నాయి. దళిత, గిరిజన ద్రోహి.. జలగ జగన్. ఓటేసిన వారిని కాటేసే రకం ఆయనది. ఏకలవ్య మోడల్ స్కూళ్లను నిర్వీర్యం చేశారు. లేటరైట్ ముసుగులో బాక్సైట్‌ను దోచుకున్నారు. విద్యుత్ ఛార్జీలతో పాటు అన్ని ధరలనూ పెంచేశారు. మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపుల్లేవు. ఆ డబ్బంతా తాడేపల్లి ప్యాలెస్‌కు పోతోంది. ఉద్యోగాల్లేక యువత రోడ్డున పడే పరిస్థితి వచ్చింది. జగన్ మీ బిడ్డ కాదు.. రాష్ట్రానికి పట్టిన క్యాన్సర్ గడ్డ. జాబు రావాలంటే కూటమి అధికారంలోకి రావాలని చంద్రబాబు అన్నారు. వైసీపీ నేతలు విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డికి మంత్రి బొత్స సత్తిబాబు ఊడిగం చేస్తున్నారని చంద్రబాబు నాయుడు విమర్శించారు. ఉత్తరాంధ్రాను బొత్స కుటుంబం దోచుకుందని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అవినీతిపరుడనే స్థాయి బొత్సది కాదని హితవు పలికారు. మీకు దమ్ముంటే ప్రధాన మంత్రిని మీ జగన్ రెడ్డి విమర్శించి చూడమను అని అన్నారు. బొత్స పనైపోయిందని చంద్రబాబు అనగానే జనం కేరింతలు కొట్టారు. జగన్ రెడ్డి తెచ్చినవి నవ రత్నాలు కాదు అవి నకిలీ రత్నాలని ఎద్దేవా చేశారు. చీపురుపల్లిలో జన సునామీ చూసి చంద్రబాబు ఆనందం వ్యక్తం చేశారు.

# హామీలు కలిసి వచ్చేనా!

హైదరాబాద్,కాంగ్రెస్ పార్టీ ప్రజల ముందు ఉంచిన హామీలు, వాగ్దానాలు కలిసి వచ్చేనా! అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. అధికారం చేపట్టేందుకు, బిజెపిని లోక్‌సభ ఎన్నికల్లో నిలువరించడానికి కాంగ్రెస్ పార్టీ ప్రజల ముందు పెట్టిన హామీలు ఓటర్లు ఆదరించి ఆ పార్టీకి బాసటగా నిలుస్తున్నారా.. ఎటు వైపు మొగ్గు చూపుతారు అన్న చర్చ రాజకీయ వేడిని పుట్టించింది.కేంద్రంలో పదేళుగా అధికారంలో ఉన్న బిజెపి ఓటమికి కాంగ్రెస్ ప్రకటించిన ఐదు హామీలు విజయతీరం వైపు న్యాయస్థానం! హామీలు ఏమేరకు ఫలితాలు ఇస్తాయన్న చర్చోపచర్చలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఐదు న్యాయాల పట్ల ఒకింత ప్రజల నుంచి సానుకూలత వ్యక్తమవుతున్నప్పటికీ భౌతికంగా ఓటు రూపేణ ఆ పార్టీ మలుచుకుంటూందా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.'ఇండియా' కూటమిలో రాజకీయ పక్షాలు కాంగ్రెస్ పార్టీ పలు హామీలతో పాటు 'యువ న్యాయం', 'నారీ న్యాయం', 'న్యాయం', 'శ్రామిక న్యాయం', 'సామాజిక న్యాయం' వుంటి ఐదు గ్యారంటీలను ప్రకటించింది. సిపిఐ, సిపిఐ (ఎం), ఆర్‌జెడి, సమాజ్‌వాజ్ పార్టీ, డిఎంకె, నేషనల్ కాన్ఫరెన్స్, పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ, శివసేన, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ, జార?ండ్ ముక్తి మోర్చా వంటి పార్టీలు కాంగ్రెస్ పార్టీతో జతకట్టి లోక్‌సభ ఎన్నికలు 2024 పోటీ పడుతున్నాయి. 'ఇండియా' కూటమిలో ఉన్న పార్టీలు వేరువేరుగా ఎన్నికల ప్రణాళికను ప్రకటించాయి. కొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీతో పలు పార్టీలు పొత్తు పెట్టుకోగా, రాష్ట్రంలో కాంగ్రెస్‌తో జతకట్టకుండా ఆయా పార్టీలు ఎన్నికల సభలో తలపడుతున్నాయి. అయితే కాంగ్రెస్ పార్టీ 5 గ్యారంటీల ప్రభావంచూపి విజయాన్ని ఏమేరకు అందిస్తాయన్న ప్రశ్నలు వెలుగు చూసున్నాయి. 'ఇండియా' కూటమిలోని భాగ్యస్వామ్య పక్షాలు ప్రకటించిన ఎన్నికల ప్రణాళికను ఓటర్లు ఆదరిస్తారా! కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఐదు గ్యారంటీలతో పాటు ఇతర హామీల వైపు మొగ్గు చూపుతారా అన్న అంశాలు గట్టిగా వినిపిస్తున్నాయి.కాంగ్రెస్ పార్టీ గ్యారంటీలను ఒక్కసారి పరిశీలిద్దాం. 'సమన్యాయం' గ్యారంటీలో జనగణనతో పాటు ఆర్థిక, సామాజిక అంశాలతో కూడిన కులగణన, రిజర్వేషన్ హక్కు, రాజ్యాంగ సవరణ ద్వారా ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు రిజర్వేషన్ 50% మించకూడదనే పరిమిత తొలగింపు ఎస్‌సి, ఎస్‌టిలకు ఉపప్రణాళిక, ఎస్‌సి, ఎస్‌టి జనాభా ప్రాతిపదికన వార్షిక బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు, జల్, జమీన్ కై చట్టబద్ధత హక్కులు అమ లు, గిరిజన, ఆదివాసీ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. 'రైతు సమన్యాయం'లో స్వామినాథన్ కమిటీ సిఫారస్‌లను అనుసరించి పంటలకు మద్దతు ధర చట్టబద్ధత, రుణమాఫీ కమీషన్ ఏర్పాటు చేసి రుణమాఫీ కోసం కృషి పంట నష్టం జరిగిన రైతులకు పంటల బీమా పథకం ద్వారా 30 రోజుల్లో పరిహారం.రైతులకు లాభసాటి స్థిరమైన వ్యవసాయ ఉత్పత్తులు, ఎగుమతులు, దిగుమతులు అమలు చేయబడ్డాయి కాంగ్రెస్ పార్టీ భరోసా. 'కార్మిక న్యాయం' ఆరోగ్య హక్కు చట్టం ద్వారా ప్రతి కార్మికునికి ఉచిత వైద్య పరీక్షలు, మందులు, ఆపరేషన్‌తో కూడిన ఆరోగ్య రక్షణ, కనీస వేతనం రోజుకు రూ. 400 చొప్పున జాతీయ ఉపాధి పథకం అమలు, పట్టణ ప్రాంతాల కార్మికులకు ఉపాధి చట్టం హామీ, అసంఘటిత కార్మికులకు జీవితభద్రత ప్రమాద బీమా వర్తింపు, ప్రభుత్వ రంగ సంస్థల్లో కాంట్రాక్టు విధానం రద్దు స్పష్టమైన హామీలను ఓటర్ల ముందు ఉంచింది. 'యువ న్యాయం' కేంద్ర ప్రభుత్వ పరిధిలోని 30 లక్షల ఉద్యోగాల భర్తీకి

# సైకిల్ పైనే సవారీ! బాబు పొత్తిళ్లలోనే కమలం

విజయవాడ :సూర్యుడు అస్తమించని బ్రిటీషు పాలనలో భరతమాత తల్లడిల్లింది. ఎన్నో పోరాటాలతో తెల్లదొరలు తోకముడిచారు. దీంతో పరాయి పీడ విరగడయ్యింది. భారతవనిలో ప్రజాస్వామ్యం అవతరించిన వేళ.. సుమారు డబ్బై రెండేళ్ల కిందట వామపక్షం, లౌకికవాదం మధ్య అధికార యుద్ధం సాగింది. ఆ సమయంలోనే మనుధర్మ వేదం పరదాలో ఓ జనసంఘ్ బిడ్డ పురుడు పోసుకుంది. దాదాపు 28 ఏండ్లు అనాథగా మిగిలింది. హిందూత్వం, దేశభక్తి ఆయుధంతో కొత్త అవతారం ఎత్తింది. భారతీయ జనతా పార్టీకి నలబై నాలుగేళ్ల కిందట అటల్ బిహారీ వాజ్ పేయి, లాల్ కృష్ణ అద్వానీ నాయకత్వం వహించారు. 1980, ఏప్రిల్ 6న ఆపార్టీకి యవ్వన దశ ఆరంభమైంది.అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ మరణానంతరం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కేవలం ఇద్దరే ఇద్దరు బీజేపీ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 543 మంది ఎంపీల నడుమ బిక్కు బిక్కుమంటూ పార్లమెంటులోకి అడుగుపెట్టారు. అందులో తెలంగాణ బిడ్డ చందుపట్ల జంగారెడ్డి, గుజరాత్ నుంచి ఏకే పటేల్ ఉన్నారు. ఇలా తప్పటడుగులతో ఆరంభమైన బీజేపీ దశ.. ఇప్పుడు దేశాన్ని పాలించే స్థితికి చేరింది. ఉత్తర భారతాన్ని కమలదండు వశం చేసుకోగా, పశ్చిమాన పరిఢవిల్లుతోంది. ఈశాన్యాన్ని విలీనం చేసుకుంటోంది. ఇక.. తూర్పు, దక్షిణాదిన జైత్రయాత్రకు బయలుదేరిన వేళ.. బీజేపీ ఆవిర్భావం నుంచి పునాది వేసిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కాషాయ దండు ఎందుకు చతికిలపడింది. మరీ ముఖ్యంగా ఏపీలో టీడీపీ పొత్తిళ్లలోని బిడ్డగానే ఎందుకు ఉండిపోయిందనే విషయాలను చదివి తెలుసుకుందాం.

సాదా సీదా జాతీయవాద పార్టీగా 1980లో ఆవిర్భవించిన బీజేపీ.. ఉమ్మడి ఏపీలో తొలి అడుగు వేసింది. 1983 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్టీఆర్ వేసిన తెలుగుదేశం బీజం అంకురమే కాదు.. ఓ మొక్కగా అవతరించిన తరుణంలో బీజేపీ 81 స్థానాల్లో పోటీ చేసింది. ఏపీలో ఉదయగిరి నియోజకవర్గం నుంచి ముప్పవరపు వెంకయ్యనాయుడు విజయం సాధించారు. తెలంగాణలోని శాయంపేట్ నియోజకవర్గంలో చందుపట్ల జంగారెడ్డి, ముస్లింల ఇలాఖా మలక్‌పేట్‌లో నల్లు ఇంద్రసేనా రెడ్డి బీజేపీ పతాకాన్ని ఎగరవేశారు. ముప్పవరపు వెంకయ్య నాయుడు ఏకంగా తన సమీప ప్రత్యర్థి మేకపాటి రాజమోహన్ రెడ్డిపై 20,500 మెజారిటీతో గెలిచారు. అక్కడి నుంచే ఏపీ, తెలంగాణలో బీజేపీ ఒడిదుడుకులు ప్రారంభమయ్యాయి. 1985లో 10 స్థానాల్లో పోటీ చేయగా.. 8 స్థానాల్లో బీజేపీ విజయం సాధించింది. కానీ, ఏపీలో డిపాజిట్లు దక్కలేదు. తెలంగాణలోని ఆలంపూర్ స్థానంలో రవీంద్రనాథ్ రెడ్డి, హిమాయత్‌నగర్‌లో ఆలే నరేంద్ర, మలక్‌పేట్ నియోజకవర్గంలో ఇంద్రసేనా రెడ్డి, కార్వాన్‌లో బద్దం బాల్‌రెడ్డి , రామాయంపేట్‌లో రామన్నగారి శ్రీనివాసరెడ్డి, మెట్‌పల్లిలో చెన్నమనేని విద్యాసాగర్ రావు, వర్ధన్నపేటలో వన్నాల శ్రీరాములు, పరకాలలో వి.జయపాల్ విజయం సాధించారు. మొత్తమ్మీద 3,72,978 (1.62 శాతం) ఓట్లు లభించాయి.

కష్టాలతోనే పయనం షురూ.

1989లో ఒంటరిగానే బీజేపీ పోటీ చేసింది. 5 స్థానాల్లో విజయం సాధింది. అదీ తెలంగాణాలోనే తన ఉనికిని కాపాడుకుంది. ఆలంపూర్ నియోజకవర్గంలో రావుల రవీంద్రనాథ్ రెడ్డి, కార్వాన్‌లో బద్దం బాల్‌రెడ్డి , మెట్‌పల్లిలో చెన్నమనేని విద్యాసాగర్ రావు, వర్ధన్నపేట్‌లో తక్కెళ్ల పల్లి రాజేశ్వరరావు, పరకాలలో జయపాల్ విజయం సాధించారు. 1994లో ఇటు ఏపీలోనూ, అటు తెలంగాణలోనూ 280 స్థానాల్లో పోటీ చేసింది. కానీ ఏపీలో బీజేపీకి ఒక్క సీటూ దక్కలేదు. తెలంగాణలో మాత్రం కార్వాన్, మెట్‌పల్లి, మహారాజ్ గంజ్‌లో బీజేపీ అభ్యర్థులు నెగ్గారు. ఆ ఎన్నికల్లో టీడీపీ, వామపక్ష కూటమి సహా.. అన్నిపార్టీలూ ఊడ్చుకుపోయాయి.

చంద్రబాబుతో లక్కీ బంధం

కేంద్రంలోనూ, ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్, తెలుగుదేశం, సీపీఐ, సీపీఎం రాజకీయ వ్యూహాల్లో.. డిపాజిట్లు రాని పార్టీగా కుమిలిపోతున్న బీజేపీకి 1998లో లక్కీ చాన్స్ వరించింది. తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ నుంచి అధికారాన్ని



చేజిక్కించుకున్న చంద్రబాబు.. బీజేపీతో జత కలిశారు. ఈ ఎన్నికల్లో కాకినాడ నుంచి ఉప్పలపాటి వెంకట కృష్ణంరాజు, రాజమండ్రి నుంచి గిరిజాల వెంకట స్వామి నాయుడు, సికింద్రబాద్ నుంచి బండారు దత్తాత్రేయ, కరీంనగర్ నుంచి చెన్నమనేని విద్యాసాగర్ రావు విజయం సాధించారు. కేంద్ర కూటమిలో అంతర్గత కుమ్ములాటల నేపథ్యంలో 1999లో ఏపీలో ఎన్నికలు జరిగాయి. బీజేపీ 24 అసెంబ్లీ సీట్లల్లో పోటీ చేస్తే 12 స్థానాల్లో.. విశాఖపట్నం వన్ టౌన్ నియోజకవర్గం నుంచి కంభపాటి హరిబాబు, తూర్పుగోదావరి జిల్లా నగరం నియోజక వర్గం నుంచి అయ్యాజి వేమ మనేపల్లి, విజయవాడ ఈస్ట్ నుంచి కోట శ్రీనివాసరావు , కదిరి నుంచి ఎంఎస్ పార్థసారథి, అలంపూర్ నుంచి ఆర్. రవీంద్ర నాథ్ రెడ్డి, ముషిరాబాద్ నుంచి కె.లక్ష్మణ్, మలక్ పేటలో ఇంద్రసేన రెడ్డి, మహారాజ్ గంజ్ నియోజకవర్గంలో ప్రేమ్ సింగ్ రాథోడ్, సంగారెడ్డి నుంచి కె.సత్యనారాయణ , పెద్దపల్లి నుంచి గాజుల రామకృష్ణారెడ్డి, మెట్‌పల్లి నుంచి తుమ్మల వెంకట రమణ రెడ్డి , హనుమకొండలో ఎం.ధర్మారావు విజయం సాధించారు. ఇక ఏడు ఎంపీ స్థానాలనూ బీజేపీ కైవశం చేసుకుంది. అనకాపల్లిలో గంటా శ్రీనివాసరావు, రాజమండ్రిలో ఎస్బీపీకే సత్యనారాయణ, నర్సాపురం నుంచి ఉప్పలపాటి వెంకట కృష్ణం రాజు, తిరుపతిలో ఎన్. వెంకటేశం, కరీంనగర్‌లో సీహెచ్. విద్యాసాగర్రావు, మెదక్‌లో ఆలే నరేంద్ర, మహబూబ్‌నగంలో ఏపీ జితేందర్‌రెడ్డి, సికింద్రబాద్‌లో బండారు దత్తాత్రేయ గెలిచారు. ఏడుగురు ఎంపీలు గెలిచినా కేంద్రంలో మాత్రం చంద్రబాబే చక్రం తిప్పారు.

ఫ్.. పదేళ్ల శిక్ష

ఆరేళ్ల కేంద్రంలో ఒక వెలుగు వెలిగిన కమలనాథులు.. ఆ తర్వాత పదేళ్ల పాటు జనానికి దూరం అయ్యారు. 2004, 2009 ఎన్నికల్లో నీరసించిపోయారు. 2004లో ఒక్క ఎంపీ అభ్యర్థి కూడా గెలవలేదు. టీడీపీతో పొత్తు పెట్టుకుని 27 స్థానాల్లో పోటీ చేస్తే.. 10 సిట్టింగ్ స్థానాల్లో ఓటమిచెందారు. కేవలం రెండు స్థానాల్లోనే గెలిచారు. హిమాయత్‌నగర్ నుంచి జె.కృష్ణారెడ్డి 31,811, పిఠాపురంలో పి.దొరబాబు 17,899 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో ఉమ్మడి ఏపీలో 9,42,008 (2.63 శాతం) ఓట్లు వచ్చాయి. 2009లో టీడీపీ పొత్తు లభించలేదు. సింగిల్ గానే 271 స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు పోటీ చేస్తే రెండు స్థానాల్లో అదీ తెలంగాణలోనే మళ్లీ ఉనికి నిలబడింది. ఒక్క ఎంపీ స్థానం దక్కలేదు. నిజామాబాద్ నియోజకవర్గం నుంచి ఎండల లక్ష్మీనారాయణ, అంబర్ పేట్ నుంచి పరీదుద్దీన్ విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో 11,92,814 (2.84శాతం) ఓట్లు లభించాయి.

పసుపు కానుకతో.. మంత్రి కుర్చీలు

రాష్ట్ర విభజనతో ఏపీలో మళ్లీ టీడీపీతో బీజేపీ జత కలిసింది. రాష్ట్ర రాజధాని, వెనుకపడిన ప్రాంతాల అభివృద్ధి ఎజెండాతో టీడీపీ 237 స్థానాలు, బీజేపీ 58 స్థానాల్లో పోటీ చేస్తే ఏపీలో టీడీపీ 102స్థానాల్లో .. బీజేపీ నాలుగు స్థానాల్లో, తెలంగాణలో 15 స్థానాల్లో టీడీపీ, 5 స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు గెలిచారు. ఏపీలో కైకలూరు నుంచి కామినేని శ్రీనివాస్, తాడేపల్లిగూడెం నుంచి పైడికొండల మాణిక్యాలరావు, విశాఖపట్నం నార్తు నుంచి పెనుమత్స విష్ణు కుమార్ రాజు, రాజమండ్రి సిటీ నుంచి ఆకుల సత్యనారాయణ విజయం సాధించగా.. నలుగురు బీజేపీ ఎమ్మెల్యేల్లో ఇద్దరికి మంత్రి పదవులు లభించాయి.

# కేజ్రీవాల్ అరెస్టుపై న్యాయ యుద్ధం



న్యూఢిల్లీ,సార్వత్రిక ఎన్నికల సమయంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నిర్బంధం కొనసాగుతున్నప్పుడు కఠినమైన రాజకీయ వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. అవినీతి ఆరోపణలపై ఏ నాయకుడిని ప్రాసిక్యూట్ చేయాలో లేదా అరెస్ట్ చేయాలో ముందుగానే నిర్ణయించినట్లు. సుప్రీం కోర్టు త్వరలోనే కేజ్రీవాల్‌కు బెయిల్ ఇవ్వవచ్చన్న సానుకూల సంకేతాలు కనిపిస్తున్నాయి. ఒకవేళ మధ్యంతర బెయిల్ మంజూరైతే కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా ఎలాంటి అధికార విధులు నిర్వర్తించరాదని సుప్రీం ధర్మాసనం మంగళవారం వ్యాఖ్యానించింది. గురువారం (ఈ నెల 9) కానీ, వచ్చేవారం కానీ బెయిల్‌పై విచారించే ధర్మాసనం. బెయిల్‌కు ఇడి అభ్యంతరం చెబుతుండగా, బెయిల్ కేసు దర్యాప్తులో ఎలాంటి ప్రభావం ఉండబోదని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడుతోంది. ఈ నేపథ్యంలో సిక్కు ఉగ్రవాదిని విడిపించడానికి ఖలిస్థాన్ అనుకూల వర్గాల నుంచి కేజ్రీవాల్ నిధులు పొందారన్న అభియోగం తెరపైకి వచ్చింది. దర్యాప్తు చేపట్టింది జాతీయ దర్యాప్తు సంస్థకు ఢిల్లీ లెటినెంట్ గవర్నర్ సక్సేనా సిఫార్సు చేయడం. కేజ్రీవాల్‌ను బయటకు రానీయకుండా అడ్డంకులు కల్పించడంలో కేంద్ర బిజెపి హస్తం ఉందన్న ఆప్ ఆరోపణల్లో కొంతవరకు నిజాలు ఉండవచ్చన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. మంగళవారం గుజరాత్ పోలింగ్‌కు ముందటి ప్రచారంలో కేజ్రీవాల్ పాల్గొనలేకపోయారు. గత కొన్ని దశాబ్దాలుగా వారి మిత్రత్వం కానీ పాలనలోని సాధారణంగా కీలక రాజకీయ ప్రత్యర్థులపై ఆరోపణలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వాన్ని నడిపే పార్టీకి, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి మధ్య గల సంబంధాల స్థాయిని బట్టి దర్యాప్తు సంస్థలకు ఆదేశాలు జారీ అవుతున్నట్లు అనుమానించవలసి వస్తోంది.నేరారోపణలున్న అనేక మంది నాయకులు పాలక ప్రభుత్వ పార్టీలోకి చేరగానే లేదా వారికి మిత్రులు కాగానే వారి నేరాలన్నీ విస్మరించే పరిస్థితి రానురాను పెరుగుతోంది. లిక్కర్ పరిశ్రమదారులకు లాభదాయకంగా మద్యం పాలసీని రూపొందించి, భారీగా ముడుపులు తీసుకోవడంలో కేజ్రీవాల్ పాత్ర ఉందన్న ఆరోపణలపై అతని అరెస్ట్ జరిగింది. అయితే ఇందులో ఆశ్చర్యపరిచే రాజకీయ అంశం ఇమిడి ఉంది. ఆమ్ ఆద్మీ పార్టీకి నేతృత్వం వహిస్తున్న కేజ్రీవాల్‌ను ఈ సాధారణ ఎన్నికల్లో ప్రచారం చేయడానికి వీలు కల్పించడం లేదు. ఎన్నికల సమయమైనప్పటికీ నేరపరిధి నుంచి రాజకీయ నేతలను ఏ చట్టం ఉపేక్షించదన్నది వాస్తవమే. అయినా ఈ ప్రచార సమయంలో ఆయన లేకపోవడం ప్రతికూల చిక్కులకు దారి తీస్తోంది.ఈ కేసులో తనను అరెస్ట్ చేయడాన్ని సుప్రీం కోర్టులో కేజ్రీవాల్ సవాలు చేయగా దానిపై విచారణ జరిపిన సుప్రీం కోర్టు గత రెండేళ్లుగా ఈ కేసు సాగుతున్నప్పుడు దేశంలో సరిగ్గా సార్వత్రిక జరగడానికి ముందే కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయడానికి కారణమేమిటని కోర్టు ప్రశ్నించింది. జీవితం, స్వేచ్ఛ అనేవి ముఖ్యమైనవని, వాటిని నిరాకరించలేమని స్పష్టం చేసింది. ఢిల్లీ ఎక్సయిజ్ పాలసీ కేసు 2022 ఆగస్టులో నమోదైంది. సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఛార్జిషీట్లు నమోదు చేశాయి. దర్యాప్తు మాత్రం అడపాదడపా ముక్కలుగా సాగుతోంది. సాక్షులు అనేక వాంగ్మూలాలు ఇస్తున్నారు. ఒక్కొక్కటీ ఒక్కో కొత్త సమాచారంతో ఉంటోంది. అనుమానితుడిని అరెస్ట్ చేసే అధికారం అతడు నుండి పారిపోకుండా నిరోధించడానికి, సాక్షులను బెదిరించి లేదా ప్రభావితం చేసి సాక్షాలను తారుమారు చేయకుండా ఉండడానికే అవసరమవుతుంది.అరెస్ట్ చేసే అధికారానికి, అరెస్ట్ తప్పనిసరి అవసరమని మధ్య చాలా తేడా ఉంది. ఈ కేసులో స్వతంత్రంగా వాంగ్మూలాలు ఇచ్చే సాక్షుల నుంచి కాకుండా అప్రూవర్ల వాంగ్మూలాల ఆధారంగా రాజకీయ నాయకులు అరెస్ట్ కావడం కలకలం రేపుతున్న వాస్తవం. కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసే సమయం కూడా వివాదస్పదమైంది. ఇడి అనేక సార్లు జారీ చేసిన సమన్లకు కొన్ని నెలలుగా కేజ్రీవాల్ స్పందించకపోవడం వల్లనే ఇప్పుడు అరెస్ట్ చేయడం ఒక కారణంగా ఉదహరించవచ్చు. నిందితుడు దర్యాప్తు సంస్థకు సహకరించాలనే వాదన గట్టిగా వినిపిస్తోంది. నిందితుల ప్రకటనలతో నిమిత్తం లేకుండా దర్యాప్తు సంస్థలకు విచారించే అధికారం ఉంది.ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ చట్టంలోని సెక్షన్ 50 దీనికి ఒక ఆయుధం వంటిదని తెలుస్తుంది. నిందితుల వాంగ్మూలం రికార్డు చేయడానికి, అరెస్ట్ చేయడానికి వీలు కల్పిస్తుంది. సమన్లకు హాజరు కాకపోవడం అరెస్ట్‌కు ఆధారం కావడం లేదు, బెయిలుకు నిరాకరించడం ఈ కేసులో ప్రశ్నార్థకమవుతోంది. ఇదే విధంగా ప్రస్తుత ముఖ్యమంత్రులను దర్యాప్తు సంస్థలు అరెస్ట్ చేయడం కూడా ప్రశ్నార్థకమవుతోంది. బహుదశల్లో ఎన్నికలు జరుగుతున్న సమయంలో వారిని నిర్బంధంలో కొనసాగించడం మాత్రం ఫెడరలిజాన్ని, ప్రజాస్వామ్యాన్ని అణచివేయడం కిందకు రాదని న్యాయవర్గాల నుంచి వాదన వినిపిస్తోంది.

# నగరంలో మొదలైన ఇంటింటి ప్రచారం

హైదరాబాద్, ఈనెల 13న లోక్‌సభ పోలింగ్ ఉండడంతో అన్ని పార్టీలు ఓటర్ల వేటలో పడ్డాయి. ప్రధానంగా కాంగ్రెస్, బిజెపిలు బృందాలను ఏర్పాటు చేసి వార్డుల వారీగా వివరాలు సేకరిస్తున్నారు. పోల్ చిట్టీలు అందచేస్తున్నారు. పనిలోపనిగా ఓట్లు వేయమని కోరుతున్నారు. ఓ రకంగా చెప్పాలంటే ఇంటింటి ప్రచారం మొదలయ్యిందనే చెప్పాలి. ఎండకాక ముందే ఉదయమే గుంపుగా కొందరు ఇల్లకు వెళ్లి తలుపులు తడుతున్నారు. ఈ క్రమంలో ఓటరు జాబితా ప్రకారం ఇంటింటికెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. జాబితా ప్రకారం చిరునామాలో ఓటర్లు ఉన్నారా.. లేరా ? అని ఆరా తీస్తున్నారు. ఒకవేళ ఇల్లు మారితే ఎక్కడుంటున్నారు ? వారి చిరునామా, ఫోన్ నంబర్లు సేకరిస్తున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం తగ్గడంతో ఈసారి మరింత పోలింగ్ పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సొంతిళ్లలో ఉన్న ఓటర్లతో ఇబ్బంది లేకున్నా తరచూ ఇళ్లు మారే వారి అడ్రస్సులు తెలుసుకోవడం కత్తిమీద సాములా మారుతోందని నాయకులు అంటున్నారు. ఓటరు జాబితా ప్రకారం ఆయా ఇంటిలో పేరు ఉండి.. ఓటరు లేకపోతే అతని కోసం వివరాలు సేకరిస్తున్నారు. ఎక్కువగా కిరాయిదారుల విషయంలో ఓటరు దొరకడం కొంత కష్టంగా మారింది. కిరాయిదారులు తరచూ ఇళ్లు మారుతుండడంలో ఓటరు జాబితా ప్రకారం సూచించిన చిరునామాలో ఉండడం లేదు. దీంతో వారి కోసం కార్యకర్తలు ఇంటి యజమానులు, చుట్టుపక్కల వారి దగ్గర సమాచారం సేకరిస్తున్నారు. వారు ఎక్కడ ఉంటే అక్కడకు వెళ్లి వారిని కలుస్తున్నారు. పోలింగ్ రోజున తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతున్నారు. ఓటరు అన్వేషణలో బీజేపీ కొంచెం ముందుంది. గ్రేటర్‌లో నాలుగు లోక్‌సభ నియోజక వర్గాలుండగా, 24 అసెంబ్లీ స్థానాలున్నాయి. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న పోలింగ్ బూత్‌లను విడదీసి.. ఒక్కొక్కరికీ రెండు లేదా మూడు పోలింగ్ బాధ్యతలు అప్పగిస్తున్నారు. పోలింగ్ బూత్ ఇన్ చార్జితోపాటు ఇద్దరు, ముగ్గురు కార్యకర్తలు ఇంటింటికి వెళుతున్నారు. ఓటరు జాబితా పట్టుకుని..తాము పార్టీ నుంచి వచ్చామని, వివరాలు సేకరిస్తున్నట్లు ముందుగానే ఆయా కుటుంబాలకు చెబుతున్నారు. ఓటరు, అతని కుటుంబ సభ్యులు ఉంటే జాబితాలో 'టిక్' చేసుకుంటున్నారు. లేనివారి గురించి ఆరా తీస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఇంటింటికి వెళ్లి ఓటరు సమాచారం సేకరించడం వల్ల పోలింగ్ నాడు ఓటర్లను సులువుగా గుర్తించడానికి వీలుంటుందని నాయకులు అంచనా వేస్తున్నారు. ఇంటింటికి వెళ్లిన పోలింగ్ బూత్ ఇన్ చార్జి లేకపోతే, అతని వెంట వెళ్లిన కార్యకర్తలకు పోలింగ్ నాడు ఏజెంట్‌గా నియమించనున్నారు. దీంతో ఇంటింటికి వెళ్లి తయారు చేసిన జాబితాను పోలింగ్ బూత్ ఏజెంట్‌కు ఇస్తారు. ఆయా చిరునామాలో ఓటరు వివరాలపై ముందుగానే సదరు ఏజెంట్‌కు అవగాహన ఉండడం వల్ల ఒకరి ఓటును మరొకొరు వేయడానికి ఏజెంట్ నిరోధించడానికి అవకాశముందని అంటున్నారు.

# అవినీతిపై నిగ్గు తేలేనా

హైదరాబాద్, ఔటర్ రింగ్‌రోడ్డు అవినీతిపై విచారణకు ఆదేశించామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కోట్ల రూపాయల అవినీతి జిరగిందని గుర్తించామని అన్నారు. ఎన్నికలకు ముందే విచారణ చేపడతామని హామీ ఇచ్చారు. అయినా దీనిపై విపక్ష బిఆర్ఎస్ నోరుమెదపడం లేదు. ఏదైనా ఆరోపణలు రాగానే అంతెత్తు ఎగిరిపడే నేతలు అసలు మట్లాడడం లేదు. ఆనాటి మున్సిపల్ శాఖ మంత్రికెటిఆర్ కూడా దీనిపై పెదవి విప్పడం లేదు. నాటి పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని బయట పడేశాక బిజెపి అందుకుంది. ఇప్పుడు సిఎం అయ్యాక రేవంత్ రెడ్డి దీనిపైనా స్పష్టత ఇచ్చారు. విజిలెన్స్ విచారణకు ఆదేశించామని, విచారణ కాగానే చర్యలు తీసుకుంటామని తాజాగా పలు టీవీ ఇంటర్వ్యూలలో స్పష్టం చేశారు. అయితే అవినీతి జరిగివుంటే.. లేదా నిబంధనలకు విరుద్దంగా లీజ్ ఇచ్చివుంటే కేంద్రంలోని బిజెపి చర్యలు తీసుకోవచ్చు. నిజాలు నిగ్గు తేల్చవచ్చు. కానీ బిజెపి కాళేశ్వరం లేదా ఔటర్ లీజల విషయంలో కేవలం ఆరోపణలకే పరిమితం అవుతోంది. హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్డును నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వం లీజుకు ఇచ్చే విషయంలో విపరీతమైన వివాదాలు నెలకొంటున్న వేళ నిజాలు నిగ్గు తేల్చాలి. నిజానికి ఓఆర్ఆర్ ను 30 ఏళ్ల పాటు ప్రైవేటు కంపెనీకి లీజుకు ఇవ్వాల్సిన అవసరం ఏముందన్న దానికి బిఆర్ఎస్ నుంచి సమాధానం రావడం లేదు. అధికారంలో ఉండగానూ, విపక్షంలోనూ సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారు. ఓఆర్ఆర్ లీజు తమ అనుకూలమైన వ్యక్తులకు ఇచ్చుకొని, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారని నాటి పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి విమర్శించారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక విచారణకు ఆదేశించామని చెప్పారు. హెచ్ఎండీఏ కు ఓఆర్ఆర్ పై టోల్స్ వసూలు చేయడం ద్వారా రాబోయే 30 ఏళ్లలో రూ.75 వేల కోట్ల ఆదాయం వస్తుందని అంటున్నారు. లీజు ఏ కంపెనీకి టెండరు రావాలో ముందే నాటి సీఎం కేసీఆర్ నిర్ణయించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రైవేటీకరణకు తాము వ్యతిరేకమంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఓఆర్ఆర్‌ను ఎందుకు ప్రైవేటు సంస్థకు లీజుకు ఇచ్చిందని ప్రశ్నించారు. ఎన్‌హెచ్ఏఐ నిబంధనల ప్రకారం లీజు పక్రియ జరగలేదని ఆరోపించారు. పెరుగుతున్న జనాభా, వాహనాల సంఖ్యను బట్టి లీజు పరిమితిని తగ్గించుకోవచ్చని నిబంధనల్లో ఉందని, కానీ ప్రభుత్వం దాన్ని పట్టించుకోలేదు. ఓఆర్ఆర్‌ను 30ఏళ్ళ వరకు లీజ్‌కు ఇవ్వాల్సిన అవసరం ఏంటన్న దానికి నాటి మంత్రి కెటిఆర్ నుంచి సమాధానం రావడంలేదు. సగటు టోల్ గేట్స్ నుండి వచ్చిన ఆదాయం రోజుకు కోటి ఎనభై ఐదు లక్షలు దాటింది. ఏడాదికి సుమారుగా 720 కోట్లు ఆదాయం వస్తోంది. ముప్పై ఏళ్లపాటు లీజుకు ఇవ్వడమంటే సుమారుగా ఇరవై వేల కోట్ల ఆదాయం వస్తుందని అంచనా. కానీ తాజా లీజు కారణంగా కేవలం 30వేల కోట్ల ఆదాయం వస్తుందన్నారు. మరి అంతలా ఆదాయం వస్తున్న ఔటర్ రింగ్ రోడ్ టోల్ గేట్స్ లీజును అప్పనంగా ఓ కంపెనీకి కేవలం 7380 కోట్లకు 30 ఏళ్లపాటు ఎలా కేటాయిస్తారంటూ గత ఎన్నికల ముందు ప్రశ్నించారు. వెంటనే ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టోల్ గేట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ప్రభుత్వమే టోల్ గేట్ లను నిర్వహిస్తూ బ్యాంక్ నుండి నిధులు తెచ్చి బ్యాంక్ వడ్డీ చెల్లించినా మంచి లాభాలు వస్తాయని, అలాంటిది ప్రజల సొమ్మును వేలకోట్ల రూపాయలు ఐఆర్‌బి అనే సంస్థకు అప్పగించడం వెనుక ఉన్న గూడుపుఠాణి బయట పెట్టాలని డిమాండ్ చేశారు. అందులోనూ డిఫాల్టర్ గా ఉన్న ఐఆర్‌బి కంపెనీకి తిరిగి నిర్వహణ బాధ్యతలు అప్పగించడంపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ టోల్ గేట్ నిర్వహణ ఒప్పందం పక్రియ వెంటనే ఆపకపోతే కోర్టుకు వెళతామని హెచ్చరించారు. ఈ వ్యహారంపై సిబిఐ, ఈడిల కు ఫిర్యాదు చేయడంతోపాటు ఈ టోల్ గేట్ కుంభకోణంపై పోరాటం చేయనున్నట్లు బిజెపి ఎమ్మెల్యే రఘునందన్ రావు తెలిపారు. ఔటర్ వ్యవహారంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా ఆరోపణలు చేశారు. ఇదేనా కేసీఆర్ చెప్పే గుణాత్మకమైన మార్పు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ లీజుతో కల్వకుంట్ల కుటుంబం కొత్త నాటకానికి తెర తీసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నమ్మించి గొంతు కోయడంలో కేసీఆర్ కుటుంబం ఆరి తేరిందని కిషన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు.

# సోషల్ మీడియా ప్రచారంతో కళ్లకు గంతలు !




న్యూఢిల్లీ,దేశవ్యాప్తంగా ఎన్నికలు జరుగుతున్న వేళ ప్రజలు ఏ పార్టీకి ఓటేస్తారన్నది ..ఎవరిని గెలిపిస్తారన్నది జూన్ 4న ఫలితాలతో తేలనుంది. కేంద్రంలో అధికారంలో ఉన్నది బిజెపి మాత్రమే. మోడీ ప్రభుత్వం మరోమారు అధికారం కోసం గట్టి ప్రయత్నాల్లో ఉంది. ఈ క్రమంలో ప్రధాని మోడీ ఛరిష్మా.. సోషల్ మీడియా ప్రచారాలను ఉధృతం చేస్తోంది. దేశంలో మోడీని అవతారపురుషుడిగా కీర్తిస్తూ..గత పాలకులంతా పాపులుగా చిత్రీకరిస్తూ..బిజెపి సోషల్ మీడియా కోడై కూస్తోంది. సోషల్ మీడియాలో నిత్యం ప్రధాని నరేంద్ర మోడీ గురించి గొప్పలు బహుళ ప్రచారంలో ఉన్నాయి. ఆయన తుమ్మినా దగ్గినా అదో విజయంగా ప్రచారం సాగుతోంది. ఆయన అనేక విజయాలు సాధించినట్లు చెబుతున్నారు. మోడీ వచ్చిన తరవాత దేశం దశదిశ మారిందన్న ప్రచారం విపరీతంగా ఉంటోంది. అలాగే ఆయన మాత్రమే ఈ దేశాన్ని ఉద్ధరించాడన్న ప్రచారం జోరుగా సాగుతోంది. భారత్ కోసం పుట్టిన వరపుత్రుడని ప్రచారం చేస్తున్నారు. ఏ దేశం వెళ్లినా..ఏ దేశాధినేతతో మాట్లాడినా.. ఏదైనా శంకుస్థాపన చేసినా..ఏ ప్రారంభోత్సవం చేసినా ఆహా ఓహో అంటూ పుంఖానుపుఖాలుగా ప్రచారాలు వస్తున్నాయి. ప్రతి ఎన్నికల్లోనూ ఇది మరింత శృతి మించి సాగుతోంది. ఇప్పుడు సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇదే ధోరణిలో ఉంటోంది. నిజానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని అప్పులకుప్పగా మార్చేసింది. గడిచిన 9 ఏండ్లలో ఏటా సగటున రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసింది. ఫలితంగా 68 ఏండ్ల స్వతంత్ర భారతదేశంలో తీసుకొన్న అప్పుల కన్నా 9 ఏండ్ల మోదీ పాలనలో తీసుకొన్న అప్పులే ఎక్కువయ్యాయి. ఎడాపెడా అప్పులు చేసిన ఘనత నరేంద్ర మోదీదేనన్న విమర్శలు వ్యక్తమవు తున్నాయి. మరోవైపు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌పై పన్నులు, సెస్సుల రూపంలో ప్రజల ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఎంతసేపు ఆదానీ అంబానీలకు దోచిపెట్టడం, వారిని మరింత సంపన్నులగా తీర్చిదిద్దే పనులు చేపట్టడం మినహా చేస్తున్న ఘనకార్యాలు ఏవీ లేవు. దేశవ్యాప్తంగా బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు సహా 18 మెగా ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.5 లక్షల కోట్ల అంచనా ఖర్చుతో పునాదిరాళ్లు తమ పేర్లతో వేసుకొన్నారు. వాటికి పెట్టుకొన్న గడువు కూడా తీరిపోయింది. ఒక్క తట్టెడు మట్టితీసిన పని కూడా జరగ లేదు. రూ.80 లక్షల కోట్ల అప్పుల సంగతి దేవుడెరుగు.. ఏటా రూ.3 లక్షల కోట్లు పెట్రో బాదుడుతోనే వసూలు చేస్తున్నారు. ఇవన్నీ ఏమయ్యాయంటే.. రాష్ట్రాలు వ్యాట్ తగ్గించాలని సుద్దులు చెబుతారు. దారుణంగా అప్పులు చేస్తున్న తీరు ఒక వైపు అయితే... జిఎస్టీ పేరుతో వసూళ్లు చేస్తున్న పన్నులు మరోవైపు గుట్టలుగా పెరుగుతున్నా సామాన్యలకు ఉపశమనం కలిగించే పని ఒక్కటంటే ఒక్కటి కూడా చేయడం లేదు. ఇలా వచ్చిన డబ్బును ఏం చేస్తున్నారని అడిగితే..గత ప్రభుత్వాలు చేసిన అప్పులను తీర్చేస్తున్నామంటూ సామాజిక మాధ్యమాల్లో పుంఖానుపుంఖాలుగా ప్రాచరం చేస్తున్నారు. అభివృద్ధికి ఖర్చు చేస్తున్నామని, మౌళిక వసతులు పెంచామని చర్చల్లో ప్రకటిస్తున్నారు. ఇకపోతే సోషల్ మీడియా ప్రచారంలో బిజెపి నేతలు ఆరితేరారు. మోదీ ప్రభుత్వం చేసిన 80 లక్షల కోట్ల అప్పుతో చేసిన ఘనకార్యా లేంటో బీజేపీ నేతలు చెప్పగలరా అంటే సమాధానం రాదు. ఇంతకీ ఏం జరిగిందో ఎక్కడా చర్చ జరగదు. బ్రహ్మాండంగా దేశాన్ని నడిపిస్తే దానినీ పార్లమెంటులో చర్చించరు. రైతుల కోసం అంటూ ప్రవేశ పెట్టిన సాగు చట్టాలపై నా చర్చించరు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పి రైతలను వంచించినా చర్చించరు. జిఎస్టీ పేరుతో పన్నులు బాదుడుపైనా చర్చించడం లేదు. నిజానికి మోడీ అధికారంలోకి వచ్చాక పార్లమెంటులో చర్చ అన్నది పక్కకు పోయింది. ఏ అంశమైనా సోషల్ మీడియా ప్రచారం తప్ప చట్టసభల్లో చర్చించడం లేదు. లక్షన్నర కోట్లకు పైగా జిఎస్టీ వసూళ్లు అమోఘం అంటున్నారు. నిజానికి అంతగా ముక్కుపిండి వసూలు చేస్తున్న తీరుపై చర్చించరు. జిఎస్టీతో ప్రజలు ఏ విదంగా పీల్చిపిప్పిచేయబడుతున్నారో చెప్పడం లేదు. చివరకు మనం పైసాపైసా కూడబెట్టుకుని చెమటోడ్చి సంపాదించిన డబ్బులతో హెల్త్ ఇన్సూరెన్స్, జీవిత బీమా చేయించుకున్నా..జిఎస్టీ పేరుతో బాదేస్తున్నారు. దీనిపై చర్చించడం లేదు. ఇకపోతే సామాన్యుల సొంతింటి కల నెరవేరడం లేదు. నిర్మాణరంగం కుదేలయ్యింది. వ్యవసాయరంగం కుదేలయ్యింది. ఆర్థికరంగం అంతకుమించి కుదేలయ్యింది. అయినా అదీ చర్చించడం లేదు. ప్రచారంలో ఈ అంశాలకు చోటు లేదు. ఉద్యోగ ఉపాధి రంగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటిపైనా సోషల్ మీడయాలో ప్రచారం జరగదు. ఎడాపెడా పెట్రో ధరలు పెంచుతూ పోతున్నా.. దాని వల్ల కలుగుతున్న విపరిణామాలను చర్చించరు. గ్యాస్ ధరలు సామాన్యులకు భారంగా మారినా చర్చ చేయరు. అభూత కల్పనలను జోడించి చేస్తున్న చర్చల వల్ల బిజెపిని, మోడీ అతిగా చూపిస్తూ భారత్ బ్రహ్మాండం అంటూ చూపుతున్నారు. ఇంతకన్నా దౌర్భాగ్యం మరోటి ఉండదు. తిండిపెట్టి, దేశయువతకు ఉద్యోగ,ఉపాధి కల్పించి, రైతులకు గిట్టుబాటు ధరలు దక్కేలా వ్యవసాయాన్ని చేసే ఆలోచన ఏదీ మోడీ బృందానికి లేదు. ప్రస్తుతం పెంచిన పన్నులతో వచ్చిన డబ్బును గత పాలకులు చేసిన అప్పులు తీర్చేందుకు వాడుతున్నా మంటూ పచ్చి అబద్దాలు ప్రచారం చేస్తున్నది. ఈ నకిలీ వార్తలను దేశవ్యాప్తంగా గ్రామగ్రామానికి చేరేలా బీజేపీ ప్రచారం ముమ్మరం చేసింది. ప్రధానిగా నరేంద్రమోదీ 2014లో అధికారంలోకి రాకముందు కేంద్రం చేసిన మొత్తం అప్పు రూ.55.87 లక్షల కోట్లు. ఈ లెక్కన ప్రతి నెల మోదీ ప్రభుత్వం తీసుకొన్న సగటు రుణం రూ.83,341 కోట్లు. 2014లో కేంద్రానికి వచ్చిన ఆదాయంలో పెట్రోల్, డీజిల్‌పై వచ్చిన పన్నుల వాటా 5.4 శాతంగా ఉండగా, 2020-21 నాటికి అది 12.2 శాతానికి పెరింగింది. నేడు ఒక్క వంటగ్యాస్ సిలిండర్‌కు పెడుతున్న ఖర్చుతో మోదీ మొదటిసారి ప్రధాని అయినప్పుడు రెండు సిలిండర్లు వచ్చేవి. చమురు ధరల పెంపుతో కేంద్రం ఏటా రూ.3 లక్షల కోట్లను ప్రజల ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్నా..పట్టించుకోద్దన్న సూత్రాన్ని అవలంబిస్తున్నారు. ఎదురుదాడి చేస్తున్నారు. రాష్ట్రాల్లో అభివృద్ది అంతా తమ చలువేనని చాటుకుంటున్నారు. సిగ్గూఎగ్గూ లేకుండా ప్రజలను జలగల్లా పీల్చి పిప్పి చేస్తున్నారు. దీనికి చరమగీతం పాడకుంటే నష్టపోయేది ప్రజలే. ప్రజలు దీనిని నిరసించాలి. ఎక్కడిక్కడ నిలదీయాలి. సోషల్ మీడియా విష ప్రచారాలను పసిగట్టాలి. ఎక్కడికక్కడే ఎదురుదాడి ప్రారంభించాలి. తిప్పికొట్టాలి. అప్పుడే ప్రజలు విజయం సాధిస్తారు.

# పెరుగుతున్న ఎండలతో తగ్గుతున్న ఆసక్తి



న్యూఢిల్లీ,దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరగబోయే ఈ ఎన్నికల్లో అధికార ఎన్‌డిఎ, కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా' కూటమి హోరాహోరీగా పోరాడుతున్నాయి. గెలుపు తమదంటే తమదని రెండు వర్గాలు గట్టిగా చెబుతున్నాయి. అందుకు తగ్గట్లుగానే ఎండలను సైతం లెక్కచేయకుండా ప్రచారం జోరు సాగిస్తున్నాయి. అయితే ప్రజల్లో మాత్రం ఎన్నికల పట్ల నిరాసక్తత కనిపిస్తోంది. ఎవరికి ఓటేస్తే ఏమిటన్న భావన వస్తోంది. గత మూడు పర్యాయాలు జరిగిన పోలింగ్ సరళి చూస్తే ఓటింగ్ శాతం తగ్గిందని చెప్పవచ్చు. తగ్గిన ఓటింగ్ అంటే ఓటర్లలో ఉదాసీనత కనిపిస్తున్నదని, ఇది ప్రభుత్వ వ్యతిరేక ఓటు అని కాంగ్రెస్ చెబుతుండగా ఎండల కారణంగానే ఓటింగ్ శాతం తగ్గింది తప్ప మరొక కారణం కాదని ఎన్‌డిఎ వర్గాలు చెబుతున్నాయి. ఓటింగ్‌లో ఎందరు పాల్గొన్నా అదంతా తమకు అనుకూల ఓటని ఎన్‌డిఎ వర్గాలు చెబుతున్నాయి. 1952 నుంచి ఎన్నికల ఓట్ల శాతం, వివిధ పార్టీల గెలుపోటములను విశ్లేషిస్తే తక్కువ లేదా ఎక్కువ ఓట్లు పడితే అధికార లేదా విపక్షానికి విజయం తథ్యమనే విధంగా ఫలితాలు కనిపించడం లేదు. ఎన్నికల సెఫాలజిస్టులు మాత్రం తగ్గిన ఓటింగ్ శాతం అధికార పార్టీలకు వ్యతిరేకంగా మారే అవకాశాలే ఎక్కువని చెబుతున్నారు. దీనితో ప్రధానంగా పోటీ పడే రెండు ప్రధాన కూటముల్లో తక్కువ ఓటింగ్ భయాం దోళనలు నెలకొన్నాయి. అయినా రెండు కూటములు తమదే విజయమంటూ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. దీనిపై వాదోపవాదాలు ఎలా వున్నా 50 డిగ్రీలకు పైగా వాతావరణం పెరిగితే ప్రజలు బయటికి వచ్చి క్యూలో నిలబడే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ప్రస్తుతం ఓటింగ్ సమయం ఉదయం 7 గం. నుంచి సాయంత్రం 5 గం. దాకా ఉంది. ఉదయం 8 దాటితే ఎండలు ప్రజలను వణికిస్తున్నాయి. దీనికి తోడు వడగాడ్పులు అనేక మంది ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. మరోవైపు కరంటు కోతలు ఎన్నికల పక్రియకు ఆటంకం కల్పించే అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో ఎన్నికలు జరిపి ఇప్పుడు ఓటింగ్ శాతం తగ్గిందనో, పెరిగిందనో చర్చించడం సరైనది కాదని రాజకీయ పండితులు అంటున్నారు. తెలంగాణలో ఎన్నికల సంఘం కాస్త జాగ్రత్త పడి పోలింగ్ సమయాన్ని 6 గంటల దాకా పొడిగించమని అడగడం, కేంద్ర ఎన్నికల సంఘం అంగీకరించడం జరిగింది. నిజానికి దేశవ్యాప్తంగా సాయంత్రి 7 గంటల వరకు ఓటింగ్ పొడిస్తేనే మంచిది. ఇకపోతే ఓటింగ్ శాతం తగ్గడానికి మండే ఎండలే కారణమని ఎన్నికల సంఘం వర్గాలు కూడా చెబుతున్నాయి. మొదటి రెండు దశల ఎన్నికల్లో ఎండలు 44 డిగ్రీల ఫారెన్ హీట్‌కు పరిమితమైతే మే నెలలో ఇంకా ఎండలు విజృంభించే అవకాశముంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఎండలు మే నెలలో 50 డిగ్రీలకు చేరినా ఆశ్చర్యం లేదని చెబుతున్నది. మండే ఎండలు, వీచే వడగాడ్పులు ప్రజలను ఇంటికే నిర్బంధం చేస్తున్నాయి. అలాంటి పరిస్థితిలో మునుముందు జరుగబోయే ఎన్నికల్లో ఓటింగ్ శాతం ఇంకా పడిపోయే అవకాశాలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తగ్గిన ఓటింగ్ శాతం ఎవరికి లాభిస్తుందనేది తీవ్ర చర్చనీయాంశ మైంది. దీనిపై గతంలో ఎన్నికల ఫలితాలు, సెఫాలజిస్టుల అంచనాలపై చర్చలు సాగుతున్నాయి. అయితే ఖచ్చితంగా ఓటింగ్ తక్కువైతే, ఎక్కువైతే అధికార పక్షానికి, విపక్షానికి లాభం జరుగుతుందనే శాస్త్రీయ అంచనాలు అయితే లేవు. ఎవరికి అనుకూలంగా వారు ఓటర్ టర్నవుట్‌ను మలుచుకుని జోస్యాలు చెబుతున్నారు.దేశంలో ఇప్పటిదాకా మూడు దఫాలుగా జరిగిన సార్వత్రిక లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం గతంతో పోలిస్తే తక్కువగా నమోదు కావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. 2019 ఎన్నికలతో పోలిస్తే ముగిసిన 189 లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల శాతం 3 నుంచి 4 శాతం దాకా తగ్గింది. తొలి విడతలో 101 నియోజక వర్గాలకు పోలింగ్ జరిగితే ప్రస్తుత ఎన్నికల్లో 66.14 శాతం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. 2019లో ఇవే నియోజకవర్గాల్లో జరిగిన ఎన్నికల్లో 70 శాతం దాకా ఓటర్లు ఓట్లు వేశారు. రెండో దశలో కూడా ఇదే ఓటింగ్ తీరు కనిపించింది. ఇటీవల ముగిసిన రెండో దశలో 88 నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగితే ప్రస్తుతం 66.71 శాతం ఓటర్లు ఓట్లు వేస్తే గడిచిన ఎన్నికల్లో ఓటర్లు ఇక్కడ 70 శాతం దాకా ఓట్లు వేశారు. మొత్తం 2019తో ప్రస్తుత పోలింగ్ శాతాన్ని పోలిస్తే 3.5 నుంచి 4 దాకా పోలింగ్ శాతం పడిపోయింది. దీనితో దేశవ్యాప్తంగా తగ్గిన ఓటింగ్ శాతం ఎవరికి మోదం, ఎవరికి ఖేదం అనే విషయమై పార్టీల్లో, పరిశీలకుల్లో భిన్న రీతుల్లో చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతానికి రెండు దశల ఎన్నికలే ముగిశాయి. ఇంకా ఐదు దశల్లో ఎన్నికలు జరగాలి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 70 శాతం పైగా ఓట్లు పడినప్పుడు బిజెపి 302 లోక్‌సభ సీట్లతో ఘన విజయం సాధించింది. ఈ దఫా ఓటింగ్ శాతం తగ్గడంతో ఓటర్ల నిరాసక్తత నెగటివ్ ఓటును సూచిస్తుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతుండగా, ఓటింగ్ తగ్గినా , పెరిగినా తమదే మూడోసారి విజయమని బిజెపి వర్గాలు చెబుతున్నాయి.

# షర్మిల చివరి సెంటిమెంట్ అస్త్రం



హైదరాబాద్,'మన ఇంటికి న్యాయం కోసం వచ్చిన ఆడబిడ్డతో రాజకీయం ఏందిరా?' మొన్న ఆ మధ్యన యాత్ర సినిమాలో వైయస్ రాజశేఖర్ రెడ్డి పాత్రధారి మమ్ముట్టి పలికే డైలాగ్ ఇది. ఎంతో ప్రసిద్ధి పొందింది ఈ డైలాగ్. అయితే రాయలసీమకు ఈ డైలాగ్ దగ్గరగా ఉంటుందన్నది ఒక వాదన. ఇప్పుడు అదే వాదన వినిపిస్తున్నారు వైఎస్ షర్మిల. కాంగ్రెస్ పగ్గాలు తీసుకున్న ఆమె కడప ఎంపీగా పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. సోదరుడు జగన్ పై గట్టి ఫైట్ చేస్తున్నారు. అయితే తన శక్తి యుక్తుల చూపిస్తున్నారు. చివరకు సెంటిమెంట్ అస్త్రాలను సైతం వదులుతున్నారు. అది కడప ప్రజలకు ఎంతవరకు ప్రభావితం చేస్తాయో చూడాలి.కడప ఎంపీగా గెలిచి తన రాజకీయ భవిష్యత్తుకు పునాది వేయాలని షర్మిల. ప్రధానంగా వైఎస్ వివేకానంద రెడ్డి హత్య అంశంపై మాట్లాడుతున్నారు. కడప ప్రజలతో మమేకమయ్యే ప్రయత్నం చేస్తున్నారు. చివరకు కొంగు చాచి అడుగుతున్నాను న్యాయం చేయండి.. మీ ఆడబిడ్డలం అడుగుతున్నాం న్యాయం చేయండి.. మీ వైయస్సార్ బిడ్డలం అడుగుతున్నాం న్యాయం చేయండి అంటూ సెంటిమెంట్ అస్త్రాలను సంధిస్తున్నారు. ఇవి విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ప్రజలను ఆలోచింపజేస్తున్నాయి.రాయలసీమలో ఆడబిడ్డది ప్రత్యేక స్థానం. పుట్టింటిని వెతుక్కుంటూ వెళ్లే మహిళకు ఎనలేని ప్రాధాన్యమిస్తారు. తోబుట్టువుగా చూసుకుని శక్తి కొలదిసాయం చేస్తారు. ఇప్పుడు దానినే గుర్తు చేస్తున్నారు షర్మిల. తోడబుట్టిన అన్న వారికి అన్యాయం చేశాడని.. ప్రజలే సోదరులుగా మారి తనకు న్యాయం చేయాలని కోరుతున్నారు.అయితే ప్రస్తుతం వైసీపీ సోషల్ మీడియా ప్రభావం చూపుతోంది. రాయలసీమలోఅన్నను మోసం చెల్లలేదని.. అన్నను విలన్ గా చూపే చెల్లి లేదని.. అన్నను దెబ్బతీయాలని ప్రత్యర్థులతో చేతులు కలిపి చెల్లి లేదని.. చెబుతూ వైసిపి సోషల్ మీడియా ప్రచారం చేస్తోంది. అయితే ఒకపక్క షర్మిల సెంటిమెంట్ అస్త్రం.. మరోవైపు వైసీపీ తిప్పికొట్టే వ్యూహం.. మరి ఇందులో ఎవరు సక్సెస్ అవుతారో చూడాలి.

# రిజర్వేషన్లను రద్దు చేసేందుకు రంగం సిద్ధం



మెదక్,ఈ దేశంలో రాజ్యాంగంతోనే పేదలకు బలమైన శక్తి వచ్చిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. దేశంలో 90శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాధికారం దక్కటం లేదు. విద్య, ఉద్యోగాలు, ఓటు హక్కు అన్నీ మనకు రాజ్యాంగం ద్వారానే వచ్చాయి. దాంతో పాటు రిజర్వేషన్లు కూడా రద్దు చేయాలని భాజపా, ఆర్‌ఎస్‌ఎస్ కుట్ర చేస్తున్నాయని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్ జిల్లా నర్సాపూర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర సభలో ఆయన ప్రసంగించారు. గొప్ప మేధావులు ఏళ్ల తరబడి కృషి చేసి దేశానికి రాజ్యాంగం అందించారు. ఎంతో గొప్పదైన మన రాజ్యాంగాన్ని మారుస్తామని భాజపా నేతలు చెబుతున్నారని హెచ్చరించారు. రిజర్వేషన్లు రద్దు చేసే కుట్రలో భాగంగానే ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయిస్తున్నారు. క్రమంగా అన్నింటినీ ప్రైవేటు పరం చేసి రిజర్వేషన్లు రద్దు చేయాలనేది భాజపా ఆలోచన. మోదీ పదేళ్లలో విమానాశ్రయాలు, పోర్టులు, భారీ పరిశ్రమలు విక్రయించారు. భాజపా కుట్రలను అడ్డుకునేందుకు ఇండియా కూటమి శాయశక్తులా పోరాడుతోంది. మోదీ పాలనలో కేవలం 2శాతం ఉన్న బిలియనీర్ల చేతిలోకి దేశ సంపద అంతా వెళ్తోంది. బలహీన వర్గాల్లో రాజకీయ చైతన్యం తెచ్చేందుకు మేం కృషి చేస్తున్నాం. దేశంలో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించేందుకు గొప్ప పథకాన్ని రూపొందించాం. ఇండియా కూటమి అధికారంలోకి వచ్చాక.. నిరుపేదలందరితో ఒక జాబితా రూపొందిస్తాం. ప్రతి కుటుంబం నుంచి ఒక మహిళ పేరును ఎంపిక చేసుకుని వారి బ్యాంకు ఖాతాలో రూ.లక్ష డిపాజిట్ చేస్తాం. విద్య, వైద్యం తదితర కుటుంబ ఖర్చుల కోసం వారికి ప్రతి నెలా రూ.8,500 వారి ఖాతాలో జమ అవుతాయని రాహుల్ గాంధీ తెలిపారు. ఈ క్రమంలో పూర్తి ఆధిపత్యం సాధించి బీజేపీ పార్టీ నేతలు రాజ్యాంగాన్ని మార్చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. అట్టడుగు వర్గాలకు రక్షణ రాజ్యాంగమని తెలిపారు. రాజ్యాంగం రాయడం కంటే ముందు పేదలకు హక్కులు లేవని చెప్పారు. సామాన్యుల గొంతుక భారత రాజ్యాంగమని తెలిపారు. రాజ్యాంగాన్ని అంబేద్కర్ ఎంతో శ్రమించి రాశారని తెలిపారు. కాంగ్రెస్ లక్ష్యం ఒక్కటే రాజ్యాంగాన్ని రక్షించడమేనని చెప్పారు. ఖర్గే, రేవంత్, తాను రాజ్యాంగాన్ని కాపాడాటం కోసం శ్రమిస్తున్నామని తెలిపారు. ఈ ఎన్నికలు రెండు సిద్ధాంతాల మధ్య జరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. దేశంలో పెట్టుబడి దారు వ్యవస్థను పెంచి పోశిస్తున్నారని చెప్పారు. 2 శాతం ఉన్న ధనవంతుల చేతిలో దేశ సంపద మొత్తం ఉందన్నారు. దేశంలో 20 మంది బడా వ్యాపారుల కోసమే మోదీ పనిచేస్తున్నారని ఆరోపించారు. రిజర్వేషన్లు మార్చడం కోసమే సర్కార్ ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహిస్తుందని అన్నారు. దేశంలో బీజేపీ రాజ్యాంగాన్ని ఎత్తేయాలని చూస్తుంటే తాము 50శాతం పరిమితి ఎత్తివేయాలని చూస్తున్నామని అన్నారు. ఏ శక్తి రాజ్యాంగాన్ని మార్చలేదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశంలో కులగణన చేస్తామని తెలిపారు. ఒక చారిత్రాత్మకమైన నిర్ణయానికి తాము ప్రయత్నిస్తున్నామని తెలిపారు. దేశంలోని నిరుపేదలు ఎంత మంది ఉన్నారో వారందరి పేరు మీద జాబితా తయారు చేయబడుతుందని అన్నారు.ప్రతి కుటుంబం నుంచి ఓ మహిళను ఎంపిక చేసి ఆమెకు రూ. లక్ష డిపాజిట్ చేస్తామని తెలిపారు. దేశంలోని ప్రతి మహిళ అకౌంట్ లో రూ. 8500 జమ చేయబడతాయని తెలిపారు. చదవు కోసం ఇంటి ఖర్చుల కోసం ఈ డబ్బు ఉపయోగపడుతుందని అన్నారు. ఒక్కదెబ్బతో దేశంలోని పేదరికాన్ని తరిమేసిన వాళ్లమౌతామని తెలిపారు. మోదీ కోట్ల మంది ఉవకులను నిరుద్యోగులను చేశారని ఆరోపించారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి టీం ప్రజల కోసం పనిచేస్తుం దని తెలిపారు. ఆరు గ్యారెంటీలు ఖచ్చితంగా అములు చేస్తామని చెప్పారు. పంద్రాగస్ట్ లోగా రైతు రుణమాఫీ చేస్తామని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధును గెలిపించాలని కోరారు. 1980లో మెదక్ నుంచి ఇందిరాగాంధీ ఘన విజయం సాధించారని, ఆమె ఎంపీగా ఉన్నప్పుడే ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. భెల్, ఇతర పరిశ్రమలు ఈ ప్రాంతానికి వచ్చాయన్నారు. గత 25 ఏళ్లుగా మెదక్ లోక్‌సభ స్థానం భారాస, భాజపా చేతిలో చిక్కి నలిగిపోయిందని వ్యాఖ్యానించారు. దుబ్బాక ప్రజలను మోసం చేసిన వ్యక్తే మళ్లీ మెదక్ భాజపా ఎంపీ అభ్యర్థిగా ఉన్నారని ఎద్దేవా చేశారు. కలెక్టర్‌గా ఉన్నప్పుడు ఈ ప్రాంత రైతులపై అక్రమ కేసులు పెట్టి హింసించిన భారాస ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని ఓడించి కేసీఆర్, హరీశ్‌రావుకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. నర్సాపూర్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , కాంగ్రెస్ ఇన్ చార్జి దీప దాస్ మున్సి, మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ తదితరులు పాల్గొన్నారు. జనజాతర బహిరంగ సభ వేదికగా బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలపై ఓ రేంజ్ లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు.

# పెద్దపల్లిలో విజయ నిర్ణేతలు వీళ్లే..




పెద్దపల్లి:సింగరేణి ఓట్ల పై దృష్టి పెట్టిన ప్రధాన పార్టీ అభ్యర్థులు పోటా పోటీగా ప్రచారం చేస్తున్నారు. పేరుకు తగ్గట్టే అది పెద్ద పార్లమెంటు నియోజకవర్గం. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లతో విస్తరించి ఉన్న ఆ నియోజకవర్గంలో సింగరేణి కార్మిక కుటుంబాల ఓట్లే కీలకం. దీంతో కార్మిక కుటుంబాలను ప్రసన్నం చేసుకునేందుకు ఎవరి ప్రయత్నాలను వారు ముమ్మరంగా చేస్తున్నారు. కార్మికుల ప్రధాన సమస్యలను ఎజెండాలుగా ఎంచుకొని ముందుకు సాగుతున్నారు. ఉత్తర తెలంగాణలోని పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో పోరు రసవత్తరంగా కొనసాగుతోంది. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా కాకా వెంకటస్వామి మనుమడు, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తనయుడు గడ్డం వంశీకృష్ణ పోటీ చేస్తుండగా, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. బిజెపి అభ్యర్థిగా గోమాస. శ్రీనివాస్ రెండవసారి తన అదృష్టాన్ని పరిక్షించుకోబోతున్నారు. ఈ ముగ్గురు ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రజల్లో పట్టు కోసం ప్రయత్నాలు కొనసాగిస్తూనే, కీలకమైన సింగరేణి కార్మిక కుటుంబాల మద్దతుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఐదు అసెంబ్లీ సెగ్మెంట్ల ఫలితాలను ప్రభావితం చేసే సత్తా సింగరేణి కార్మికులది.ఈ విషయాన్ని గ్రహించిన ప్రధాన పార్టీలు, సింగరేణి కార్మిక కుటుంబాల మద్దతు కోసం విస్తృతంగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లను గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకోవడం, ఇటీవల జరిగిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంధ %×చీఖజ% సత్తా చాటుకోవడం, సింగరేణి గుర్తింపు సంఘమైన %ూ×ఖజ% మద్దతును ప్రకటించడం, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి అనుకూలించే అంశాలుగా ఆ పార్టీ అంచనా వేస్తోంది. మరోవైపు బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొప్పుల ఈశ్వర్ స్వతహాగా సింగరేణి కార్మికుడు కావడం, కార్మిక ఉద్యమాలలో చురుకైన పాత్రను పోషించిన చరిత్రను కలిగి ఉండడం ఆయన గెలుపుకు లాభించే అంశాలుగా బీఆర్‌ఎస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇంకోవైపు బిజెపి అభ్యర్థి కూడా సింగరేణి కార్మిక కుటుంబాల మద్దతు కోసం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పెద్దపల్లి పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో గెలుపు ఓటములను నిర్ధారించే సింగరేణి కార్మికులు అంతిమంగా ఎటువైపు మొగ్గుచూపుతారనే అంశం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

# కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే మైనార్టీలకు మేలు

నాగర్‌కర్నూల్ : దేశంలో మైనార్టీలకు అండగా ఉంటూ.. వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ నాగర్ కర్నూల్ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి అన్నారు. ఇవ్వాల జిల్లా కేంద్రంలోని మైనార్టీ హాల్‌లో సాయంత్రం జరిగిన ఓ సమావేశంలో మాట్లాడుతూ.. మైనార్టీల రిజర్వేషన్ ఉండాలన్నా.. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నా దేశంలో శాంతిభద్రతలు నిలబడాలన్నా.. కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని స్పష్టం చేశారు.అందుకోసం మైనార్టీలంతా కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని మల్లు రవి కోరారు. వారి అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. మహిళలు, పేదలు, బడుగు బలహీన వర్గాలకు అండగా ఉండేందుకు ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తోందన్నారు.ఆరు గ్యారెంటీ పథకాల్లో ఇప్పటికే కొన్ని అమలు చేశామని మల్లు రవి చెప్పారు. ఎన్నికల అనంతరం రైతులు, నిరుద్యోగులు, మహిళలు, పేదలకు ఉపయోగపడే మరిన్ని పథకాలు తీసుకు వస్తామని, నిరుపేదలకు అండగా ఉంటామని తెలిపారు.



Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com